# సుమబాల

అంతర్జాల పిల్లల మాసపత్రిక

01-01-2026 సంపుటి -1 జనవరి సంచిక-1 రూ.50/-



సుమతి
అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

# సుమబాల

## అంతర్జాల పిల్లల మాసపత్రిక





## సుమబాల పరివారం

**సంపుటి :1** **జూలై 202** **సంచిక:1**

**సంపాదకురాలు :అవుతు శ్రీవిద్య**

**సహ సంపాదకులు :ఈ శ్రీనివాస రెడ్డి**

**ముఖచిత్రం & ఏ ఐ చిత్రాలు :మోక్షదేవ్**

**గ్రాఫిక్స్:జ్ఞానిక**

**చందా వివరాలు:**

సంవత్సర చందా రూ 500 (ఆన్లైన్ )

సంవత్సర చందా రూ 1000 (ప్రింట్)

ప్రకటనలు , చందాలకు మరియు రచనలు ,అభిప్రాయాలు

పంపవలసిన చిరునామా

sumathibalapatrika@gmail.com

ప్రచురణ

**సుమతి పబ్లికేషన్స్**

(RC NO.:538/2006 )

హౌస్ నం :26 -46 -79,వేణుగోపాల నగర్,
గుంటూరు ,ఆంధ్రప్రదేశ్



# మా విన్నపం ...





**సుమబాల.. బాలల చేతిలో సుమమాల**

చక్కని కథలతో.. ధారావాహికలతో.. అందమైన రంగురంగుల బొమ్మలతో జనవరి – 2026 సంచిక మీ ముందుకు వచ్చేసింది.

అచ్చులో కూడా అందుబాటులో వుంది మీ అభిమాన సుమబాల పత్రిక.

అప్పటి చందమామను గుర్తుకు తెచ్చేలా ఉత్తమ సంస్కారాలతో, అలనాటి చందమామకు రచనలు చేసిన అతిరథ మహారథుల సహకారంతో సుమబాల సృష్టి జరిగింది.

మీ అందరి ప్రోత్సాహ సహకారాలతో ఈనాటి బాలలకు కూడా, ఆనాటి చందమామను పోలిన సుమబాల పరిచయం చెయ్యడం సాధ్య పడుతుంది. ఈ బాలలు కూడా తమ బాల్యంలోని మధురిమలను మరువలేని జ్ఞాపకాలుగా మనలాగే మార్చుకోనివ్వండి.

ఈ సందర్భంగా గాలిబ్ పలుకులు స్ఫురణకు వస్తున్నాయి –

దేవుడితో అంటాడు – ఉందో లేదో తెలియదు నీ స్వర్గం తిరిగిచ్చేయ్ నా బాల్యం. తిరిగిచ్చేద్దాము వారికి ఆ అందమైన బాల్యాన్ని సుమబాల వారి చేతికి అందించి.

మీ ప్రియమైన చిన్నారులకు ఈ సాహితీ చందమామను కొత్త సంవత్సర కానుకగా అందివ్వండి. వారి ముఖంలోని సంతోషపు వెలుగులను మీ గుండెల్లో నింపుకోండి.





# లోపలి పేజీలలో .....


## చిన్నకథలు:

1. తెలివైన తండ్రి

2.వెంటాడే అదృష్టం

3.ఒంటి కొమ్ము రాక్షసుడు

4.కబుర్ల కుందేలు

5.పేరు

6. రామ చిలుక పెళ్లి

7.దైవ వివాహం

8.అందరూ అమాయకులే

## పెద్ద కథలు :

1.దూరపు కొండలు నునుపు

2.మూడు అట్ట పెట్టెలు

## బాల గేయాలు:

1.నారు మడి

2.తేనెలొలుకు భాష

3. మువ్వన్నెల జెండా

4. ఏనుగమ్మా ఏనుగు

## బొమ్మల కథలు:

అల్లాఉద్దీన్ అద్భుత దీపం

పంచతంత్రం

రాము & రోబో

## సైన్సు కథలు:

థామస్ ఆల్వా ఎడిసన్

## నీతి కథలు:

అక్బర్ బీర్బల్ కథలు

తెనాలి రామకృష్ణ కథలు

ముల్లా నసీరుద్దీన్ కథలు

నీతి చంద్రిక కథలు

భేతాళ కథలు

## ధారావాహికలు :

అభిమన్యుడు

శివాజీ

## పోటీలు:

1.బొమ్మకు కథ


2.బొమ్మలు వేసి పంపండి

3. పజిల్




## ఇంకా ...


1.రోబో సంగతులు ,2.విహారి ,3.మెదడుకు మేత 4.వేమన పద్యాలు 5. సుమతీ శతకం 6.బొమ్మలు చేద్దాం 7. రంగులు వేద్దాం 8. కనుక్కోండి చూద్దాం 9. తేడాలు కనిపెట్టండి 10.చూడాల్సిన సినిమా 11.వండర్ కిడ్స్



# నూతన సంవత్సర శుభాకాంక్షలు

కొత్త సంవత్సరం ఒక ఖాళీ పుస్తకం లాంటిది, మీ కలలు, కృషితో నింపండి. మీ ప్రతి పేజీలో విజయగాథ రాయబడనివ్వండి. కొత్త సంవత్సరం అనేది మన జీవితంలో కొత్త లక్ష్యాలను నిర్దేశించుకునే సందర్భం. కొత్త అంచనాలతో ముందుకు సాగాలని కొత్త ఏడాది ప్రారంభంలో సంకల్పించుకుంటుంటాం. గత సంవత్సరానికి వీడ్కోలు చెప్పడానికి, దాని మంచి జ్ఞాపకాలను కాపాడుకోవడానికి, అసంపూర్తిగా మిగిలిపోయిన వాటిని పూర్తి చేస్తానని వాగ్దానం చేయడానికి కొత్త ఏడాది ప్రారంభాన్ని ఎంచుకుంటారు.

కొత్త సంవత్సరం కొత్త సూర్యుడి లాంటిది..ఇది మనకు ప్రతిరోజూ కొత్త కాంతిని, శక్తిని ఇస్తుంది. ఈ సంవత్సరం మీ జీవితంలో కాంతిని ,ఆనందాన్ని మాత్రమే ఉండనివ్వండి. గత సంవత్సరం పొరపాట్లను మర్చిపోండి. ప్రేమతో,ఆశతో నూతన సంవత్సరాన్ని స్వీకరించండి.

ఇట్లు

**సుమబాల**



# తమాషాలెక్కలు



## 9 (తొమ్మిది) అంకె విశిష్టత

సుమబాల నేస్తాలు! మీకు అంకెలు, సంఖ్యలు తెలుసుగా, మనకున్న (సున్నాను తీసివేస్తే )అంకెల మొత్తం తొమ్మిది. అవి 1,2,3,4,5,6,7,8,9 వీటి మొత్తాన్ని కూడితే కూడితే 45 వస్తుంది.4+5 =9 ఇలా వచ్చిన ఈ తొమ్మిది విశిష్టత ఏమిటో తెలుసుకుందాం.

సంఖ్యాశాస్త్రంలో ఈ 9వ అంకెను బ్రహ్మ సంఖ్య, దైవ సంఖ్య, వృద్ధి సంఖ్య, పురాణ సంఖ్య, మృత్యుంజయ సంఖ్య అని పలు పేర్లతో పలుస్తుంటారు.

మీరు ఏదైనా మీకు ఇష్టమైన సంఖ్యను తీసుకొని ఆ సంఖ్యను తొమ్మిదిచే (9) హెచ్చించండి. ఫలితాన్ని మొత్తం కూడి ఏక సంఖ్యను చేయండి. అప్పుడు 9 వస్తుంది.ఉదా!! 4213645 ఇది మీ ఇష్ట సంఖ్య. దీనిని తొమ్మిదిచే హెచ్చించగా 37922805 వస్తుంది. దీని మొత్తం 36 అవుతుంది. ఏక సంఖ్య చేయగా 3+6=9 వస్తుంది. ఈ విధంగా ఎంత చిన్న, పెద్ద సంఖ్యనైనా తొమ్మిదిచే హెచ్చిస్తే వచ్చేది 9 దే.

మనకున్న యుగాలు

1) కృతయుగం 1728000సం"వీటి మొత్తం కూడితే 1+7+2+8=18 అవుతుంది. ఏక సంఖ్య చేస్తే 9 వస్తుంది.

2) త్రేతా యుగం 1296000సం"వీని మొత్తం కుడితే,1+2+9+6=18 వస్తుంది. ఏక సంఖ్య చేయగా 1+8=9 అవుతుంది.

3) ద్వాపర యుగం 864000సం",వీటి మొత్తం కూడితే 8+6+4=18 వస్తుంది. ఏక సంఖ్య చేయగా 1+8=9 అవుతుంది.,పై మూడు యుగాల మొత్తం కూడగా3888000 వస్తుంది,ఏక సంఖ్య చేయగా 3+8+8+8=27.2+7=9 అగును.

అలాగే మన మహాభారతం తొమ్మిది సంఖ్యతో ముడిపడి ఉంది. ముందు ఉన్న మొత్తం పర్వాలు=18; 1+8=9. కురుక్షేత్ర యుద్ధం జరిగిన దినాల మొత్తం=18;. 1+8=9 అగును.మహాభారత సైన్యం=18 అక్షౌహిణిలు.1+8=9 అగును.భగవద్గీత అధ్యాయాలు=18,1+8=9 అగును.వ్యాసమహర్షి రచించిన పురాణాలు=18;. 1+8=9 అగును. సృష్టిలోని ప్రతి ప్రాణికి తొమ్మిది రంధ్రాలు ఉంటాయి. ఒక్క సర్పానికి తప్ప. శిశువు గర్భంలో ఉండేది కూడా 9 నెలలు.

గంటకు 360 సెకండ్లు.3+6=9 అగును.రోజుకు 14400 నిమిషాలు. వీటిని కూడగా 1+4+4=9 వచ్చు.నెలకు 720 గంటలు. వీటిని కూడితే 7+2=9 వచ్చు.సంవత్సరానికి 360 రోజులు.వీటిని కూడితే 3+6=9వచ్చు.

పైన పేర్కొన్న కారణాలవల్ల ఈ తొమ్మిదవ అంకె (9) అన్ని అంకెల కన్న మిన్న అని రుజువైనదిగా నేస్తాలు

ఉన్న అన్ని అంకెలకన్నా మిన్న మన తొమ్మిదవ అంకెనే అన్న,తెలుసుకొని మసులుకో చిన్న,తెలియకుంటే మార్కులు

సున్న.

- గుర్రాల లక్ష్మారెడ్డి



## కథ






# తెలివైన తండ్రి

. ఏ ఒక ఊరిలో ధనయ్య అనే వ్యాపారిఉండేవాడు.

ఆయనకి ముగ్గురు కొడుకులు.తన వారసులు తన తర్వాత వ్యాపారం ఎలాచూసుకుంటారో అని ధనయ్య ఆలోచన.

వారు ముగ్గురు కలిసి మెలిసి వ్యాపారం చేయాలనిధనయ్యకోరిక.అందుకు ఏంచేయాలి. వారితో ఏవ్యాపారం పెట్టించాలిఅనేఆలోచన ఎంతకీతెగటంలేదు.

ధనయ్య తన పిల్లల మనస్తత్వాలకుతగినవ్యాపారంపెట్టి స్తే ముగ్గురు కలిసి చక్కగా చేసుకుంటారనుకున్నాడు.

ధనయ్యపెద్ద కొడుకు రాము "కార్యసాధకుడు'మంచివాక్చాతుర్యంఉన్నవాడు. ఎవరినైనా మంచిమాటలతో తనవైపు తిప్పుకుని తనకు కావలసిన ఏపనినైనా చాకచక్యంగా చేయించుకోగలసామర్ధ్యంగలవాడు..కానీ ఇంట్లో నుంచి ఎక్కువగా బైటికి వెళ్ళడంఇష్టంఉండదు.

ఇక రెండో కొడుకు రాజు చురుకుగా తెలివిగా ఎవరు ఏపనిచెప్పినాచేస్తాడు.కానీ అదేపనిని ఆపకుండా చేసేఓపిక ఉండదు.

ఇకమూడోకొడుకు రవి "త్రిలోకసంచారి" కాళ్ళకుచక్రాలు కట్టినట్టు బైటతిరుగుతూ ఉంటాడు. అందరికీ"తలలోనాలుక" లాగ ఉంటాడు.అందరికీ సహాయం చేస్తాడు.

కొడుకులమనసెరిగిన తండ్రి ముగ్గురుపిల్లలచేత ఒకేవ్యాపారంచేయించాలనేఆలోచనతో బట్టలు వ్యాపారం చేయిస్తే రాణిస్తారనితలచి ఒకనాడు పిల్లలు ముగ్గురు ని పిలిచి తన ఆలోచన చెప్పాడు.

దానికి వారు మాకుఎటువంటి అనుభవం లేదుకదా అంటారు.

అప్పుడు తండ్రి చేస్తేనేకదా అనుభవం వస్తుంది.ఒక ఏడాది నేనుఎలాచెపితేఅలాచేయండి.తర్వాత నచ్చితే చేయండి. లేదంటేలేదుఅన్నాడు.

పెద్ద కొడుకు రాముతో నీవు ఇంటివద్ద ఉండి బట్టలు

# కథ



అమ్ము.అవిఎలాఅమ్మాలినేను నీకునేర్పుతాను.

నీకు కావలసిన బట్టలు నీతమ్ముడు రాజు ఎప్పటికప్పుడు తెచ్చిఇస్తాడు.కానీ ఏవి కావాలి ఎప్పుడు తేవాలి నువ్వేచెప్పి తెప్పించుకోవాలి అన్నాడుతండ్రి.

ఇక రవికి నీవద్ద ఉన్న బట్టలు కొన్ని ఇచ్చి ఊరూరా తిరిగి అమ్మాలనిచెప్పు.

అని ధనయ్యవ్యాపార సూక్ష్మాలునేర్పాడు.

తండ్రి మాట విని ముగ్గురూకలిసి వ్యాపారాన్నిఎంతోచాకచక్యంతోనడిపి తండ్రికి తగ్గతనయులుగాపేరుతెచ్చుకున్నారు.

నీతి:– మంచికోరిక ,ఆలోచన ఉంటే సాధించలేనిదేదీలేదు.

**-సి వి ఎస్ మహాలక్ష్మి**



## పెద్ద కథ



# దూరపు కొండలు నునుపు

అంటూ పరిగెత్తుతున్న కీకీ ని చూసి అక్కడే పార్క్ బెంచి కింద ఉన్న మీమీ గబుక్కున కీకీ ని బెంచి కిందకి లాగేసింది. కొంత సేపటికి తెప్పరిల్లిన కీకీ, మీమీ ని చూసి "థాంక్స్, సమయానికి దేవుడిలా వచ్చి నన్ను కాపాడావు లేదంటే ఈ పాటికి ఆ కుక్క నన్నుతినేసేది" అంది.

"సరే గాని నువ్వెవరు? ఎక్కడనుండి వస్తున్నావు, మీ అమ్మ ఏది? " అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్న మీమీ ని చూస్తూ,

నా పేరు కీకీ, నేను బజారు దగ్గర ఉంటాను. మా అమ్మ ఎవరో నాకు తెలీదు. నేను పుట్టగానే ఒక బాబు నన్ను ఎత్తుకొని ముద్దాడుతూ బజారు వరకు వచ్చి, వాళ్ళ అమ్మ వదిలెయ్యమంటే అక్కడ బజారులో నన్ను వదిలేసాడు. అదిగో అప్పటి నుండి దొరికింది తింటూ కాలక్షేపం చేస్తున్నా. ఇదిగో ఇవాళ ఒక కుక్క నన్ను చూసి తినడానికి వస్తుంటే, భయంతో పరిగెడుతూ ఇటొచ్చా. ఇక ఆ తర్వాత సంగతి అంతా నీకు తెలుసుగా అంది. "ఓహో, నా పేరు మీమీ, నేను ఎవరో ఎక్కడ నుండి వచ్చానో నాకు తెలీదు. ఒకరోజు వర్షంలో తీసుకువచ్చి ఈ బెంచి కింద పెట్టింది. రోజూ వస్తున్నప్పుడు నాకోసం రొట్టెముక్కలు తెచ్చి ఇస్తుంది. అవి తింటూ ఇక్కడే కాలక్షేపం చేస్తున్నా. ఇది నా కథ" అంది మీమీ.

"అయితే మనమిద్దరం ఫ్రెండ్స్ ఇవాళ నుండి ఓకేనా" అంది కీకీ. "సరే! మనకి తినడానికి, ఉండటానికి లోటు లేదు కదా, హాయిగా కలసి తిరుగుదాం. దొరికింది కలసి తిందాం. రాత్రి అవ్వగానే ఇక్కడకు వచ్చి పడుకుందాం. ఇక్కడైతే మనకి భయం ఉండదు. దీని కిందకి కుక్కలు దూరలేవు. మనం ఇంకా చిన్నవాళ్ళం కదా, చెట్లు, గోడలు ఎక్కలేము. అవి ఎక్కడం నేర్చుకున్నాక అప్పుడు ఎక్కడైనా ఎత్తుగా, కుక్కలకి అందకుండా దాక్కుందాం" అంది మీమీ.

అలా ఆ పిల్లి పిల్లలు రెండూ మంచి స్నేహితులు అయిపోయి రోజూ ఊరంతా కలసి తిరుగుతూ, దొరికింది తింటూ, ఒక టీ కోట్టు యజమాని రోజూ పోసే పాలను తాగుతూ, రాత్రి అవ్వగానే పార్కులో బెంచి కింద నిద్రపోతున్నాయి. అలా ఒక నెల గడచిపోయింది. వాటి స్నేహం బలపడింది. బాగా కలసిపోయాయి. చెట్లు, గోడలు ఎక్కడం కూడానేర్చేసుకున్నాయి.

ఇలా ఉండగా ఒకరోజు ఆ రెండూ కబుర్లు చెప్పుకుంటూ

# పెద్ద కథ



ఒక చెట్టు మీద కూర్చొని పార్కులో మామ్మ ఇచ్చిన రొట్టెముక్క తింటూ ఎదురుగా రోడ్డు మీద అందరిని చూస్తున్నాయి. అప్పుడే వాళ్ళ కంట ఒక విషయం పడింది. అవి ఆశ్చర్యంగా చూస్తున్నాయి. ఒక తెల్లటి, పడవలాంటి కారు వచ్చి చెట్టు ఎదురుగా ఉన్న ఒక షాప్ ముందు ఆగింది. అందులోనుండి ఒక అందమైన పది సంవత్సరాల పాప దిగింది. ఆ పాప చేతిలో ముద్దుగా బొద్దుగా ఉన్న పిల్లి ఉంది. ఆ పిల్లి నీలిరంగు పువ్వులున్న గౌను వేసుకుంది. ఇంకా తలకి చక్కటి హెయిర్ బ్యాండ్ పెట్టుకుంది. చూడటానికి చాలా బావుంది. అది చూసి పాపం ఈ పిల్లులకు మతిపోయింది. అబ్బా ఎంత అందంగా ఉంది, ఎంత అదృష్టం ఆ పిల్లిది అనుకున్నాయి.

ఆ అమ్మాయి వాళ్ళు షాప్ నుండి బయటకు వచ్చి కారెక్కి వెళ్లిపోయారు. మన రెండు పిల్లులు, ఇంకా ఆ పిల్లి అదృష్టాన్ని తలచుకుని ఆశ్చర్యంగా అలా చూస్తూ ఉండిపోయాయి. ఇంతలో ఆ షాప్ ముందు మరో కారు వచ్చి ఆగింది. అందులో నుండి ఒక ఆమె ఒక బొచ్చు కుక్క పిల్లని ఎత్తుకొని దిగింది. ఆ కుక్క తెల్లగా, చాలా అందంగా ఉంది. చక్కటి గులాబీ రంగు గౌను, కాళ్ళకి మాచింగ్ సాక్స్ వేసుకుంది. తలకి మెత్తని ఎర్రని బ్యాండ్ పెట్టుకొని చూపరుల్ని ఇట్టే ఆకర్షిస్తోంది. ఆమె ఆ కుక్కపిల్లని "జుజ్జు.. జుజ్జు .." అని పిలుస్తూ ముద్దాడుతోంది. అది చూసిన మన పిల్లులు ఇంకా ఆశ్చర్యపోతూ, ఆ జుజ్జు అదృష్టానికి మురిసిపోతున్నాయి. అలా కాసేపు ఆ షాప్ కి వచ్చిన ఎన్నో కుక్కలిని, పిల్లులని చూసి, షాప్ కట్టేయ్యగానే పార్కుకి వెళ్లి పడుకున్నాయి మన రెండు పిల్లులు.

కానీ వాటికి సరిగా నిద్రపట్టలేదు. కళ్ళు మూసినా, తెరచినా ఆ షాపు, అక్కడకు వచ్చే కుక్కలు, పిల్లులు, ఆ దృశ్యాలే కళ్ళముందు కదలడుతున్నాయి. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడెప్పుడు ఆ షాపు దగ్గరికి వెళతమా అని ఎదురు చూస్తున్నాయి. తెల్లారింది. అంతే ఒక్క ఉదుటున లేచి పరుగు పరుగున టీ కొట్టుకు వెళ్లి ఆ టీకోట్టు యజమాని పోసిన పాలను తాగేసి ఆ షాపు ఎదురుగా ఉన్న చెట్టు ఎక్కి కూర్చొని చూస్తున్నాయి. షాపు ఇంకా తెరవలేదు. ఎప్పుడు ఇప్పుతారా అని ఎదురు చూస్తున్నాయి. వాటి భాగ్యం కొద్దీ షాపు తెరిచారు. అది ఒక పెద్ద పెట్స్ షాపు. అందులో పెట్స్ కి అవసరమైన ఖరీదైన ఆహారం ఇంకా మంచి బట్టలు అన్నీ దొరుకుతాయి. అందుకే పెట్స్ యజమానులు అంతా వారి వారి పెట్స్ ని తీసుకొని ఆ షాపుకి వచ్చి అన్నీ కొంటుంటారు. అలా రోజూ ఉదయాన్నే రావడం, చెట్టెక్కి కూర్చొని ఆ షాపుకి వచ్చి పోయే అందమైన పెట్స్ ని చూడటం వాటి దినచర్య అయిపోయింది.

పాపం ఈ మామ్మ అవి ఎక్కడున్నాయా అని ఒకరోజు వెతుక్కొని వచ్చి చెట్టు మీద కూర్చుంటున్నాయని తెలుసుకొని అక్కడికే వచ్చి ఆ దగ్గరలో ఉన్న గట్టు మీద రొట్టెముక్కల్ని పెట్టి వెళ్ళిపోతోంది. ఇంకేం మన సదరు పిల్లుల పనే బావుంది, హాయిగా పాలు తాగి, రొట్టె తింటూ పెట్స్ ని చూసి ఆనందిస్తున్నాయి.

అలా చూడగా చూడగా వాటికి, "మమ్మల్ని కూడా ఎవరైనా పెంచుకుంటే బాగుణ్ణు" అనిపించింది. అలా అనుకున్న వెంటనే ఎవరు పెంచుకుంటారా అని ఆలోచించాయి. "మనకి రొట్టెలు పెట్టే ఈ మామ్మని అడుగుదామా పెంచుకోమని" అంది మీమీ. ఇంతలో రొట్టెముక్కలు పెడుతున్న మామ్మని చూసి అటుగా వెళ్లే ఓ ఆసామి, "ఏం మామ్మ! పిల్లుల్ని పెంచుకుంటున్నావా" అన్నాడు. "అబ్బో! నాకు అంత ఓపికేది, ఏదో అలా రోజూ మిగిలిన రొట్టెల్ని తెచ్చి ఇస్తున్నా తింటాయని" అంది. అది విని ఉసూరుమన్నాయి పిల్లులు.

"పోనీ, మనకి పాలు పోసే టీకోట్టు యజమానిని అడుగుదామా పెంచుకోమని" అంది కీకీ. ఇద్దరూ టీ కొట్టు దగ్గరికి వెళ్ళగానే పాలు పోసాడు యజమాని. అక్కడే ఉన్న ఒకడు "ఏం రాము! పిల్లులు భలే బావున్నాయి. పెంచుకుంటున్నావా" అని అడిగాడు. "అబ్బే, నాకంత తీరికేది? ఏదో రోజూ వస్తున్నాయి కదా అని కాసిన్ని పాలు పోస్తున్నాను అంతే" అన్నాడు యజమాని. అది విన్న పిల్లులు విచారంగా అక్కడ నుండి కదులుతూ "మమ్మల్ని ఎవరూ పెంచుకోరులే" అనుకున్నాయి. తిరిగి పార్కు దగ్గరికి వచ్చి బెంచి కింద కూర్చొని "ఇదిగో కీకీ .. మనల్ని ఎవ్వరూ పెంచుకోలేదని బాధపడవద్దు. నాకు నువ్వు, నీకు నేను ఉన్నాం. మనం ఎప్పటికి ఇలాగే కలసి ఉందాం" అంది మీమీ. ఆ రెండూ హాయిగా, ప్రశాంతంగా పడుకొని నిద్రపోయాయి.

హాయిగా నిద్రపోతున్న పిల్లులు యేవో మాటలు వినిపించి ఉలిక్కిపడి లేచాయి. ఎదురుగా ఇద్దరు చిన్న అబ్బాయిలు

# పెద్ద కథ



కూర్చొని తమ వైపే తదేకంగా చూడటం గమనించాయి. ఒక్క ఉదుటున లేచి దూరంగా జరిగి నిలుచున్నాయి. ఇంతలో ఒక ఆమె "రాజాబాబు... రంగాబాబు..." అంటూ అటు వచ్చింది. వస్తూనే "ఇక్కడున్నారా బాబూ... రండి పెద్దమ్మగారు పిలుస్తున్నారు" అంటూ వాళ్ళని తీసుకెళ్లిపోయింది. మీమీ, కీకీ లు మళ్ళీ పడుకున్నాయి.

మరో ఐదు నిమిషాలకి రంగా, రాజా వారి వారి తల్లులతో వచ్చారు పిల్లుల దగ్గరికి.

వస్తూనే అమ్మా మనం పిల్లిని పెంచుకుందాం అంటూ రాజా మీమీని, రంగా కీకీని ఎత్తుకున్నారు. మన పిల్లులు ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. వాటి ఆనందానికి అవధులు లేవు. ఆకాశంలో విహరించినంత సంబరపడిపోయాయి. ఎగిరి గంతులు వెయ్యాలనంత ఆనందం కలిగింది వాటికి. కానీ వాటిని గట్టిగా, జాగ్రత్తగా ఆ పిల్లలు వాళ్ళ చేతులతో కట్టేయ్యటం వలన ఆ పని చెయ్యలేకపోయాయి. అయితేనేమి వాళ్ళని కూడా పెంచుకుంటారు, ఆ ఆనందం చాలు వాటికి. మీమీ, రాజా ఒక కారులోనూ, కీకీ, రంగా ఒక కారులోనూ ఎక్కేసారు.

రెండు కార్లు కొంచెం దూరం వెళ్లి అదే పెద్ద పెట్స్ షాపు దగ్గర ఆగేయి. ఇన్నాళ్లు దూరం నుండి ఆ షాపుని చూస్తున్న వాటి పంట పండింది. దర్జాగా చూసుకుంటూ షాపులోకి వెళ్ళేయి. అక్కడ ఉన్నవాటిని వింతగా, ఆశ్చర్యంగా చూస్తుంటే ఇద్దరు వ్యక్తులు వచ్చి వాటిని జాగ్రత్తగా వాళ్ళ చేతుల్లోకి తీసుకొని లోపలికి వెళ్లి ఒక పొడవాటి కుర్చీలో కూర్చోపెట్టి, బెల్ట్ వేసేసి, చక చకా కొలతలు తీసుకొని, లోపలికి వెళ్లి అందమైన బట్టలు తెచ్చి వాళ్ళని అలంకరించేసారు.

మీమీ, కీకీ లు మురిసిపోయాయి. ఇన్నాళ్లకు వాటి కల నెరవేరింది మరి. అందరూ బయటకు వచ్చి మళ్ళీ ఎవరి కారు వాళ్ళు ఎక్కేసారు. విండోలోంచి చూస్తూ సదరు పిల్లులు కళ్లెగరేసాయి. కొంత దూరం కార్లు రెండూ ఒకే రూట్లో వెళ్లి తర్వాత చెరో రూట్లోకి వెళ్లిపోయాయి. అది చూసి అంత వరకు ఆనందంగా ఉన్న పిల్లి పిల్లలు ఒక్కసారిగా దిగులు పడిపోయాయి. మళ్ళీ అంతలోనే పెంపకానికి వెళుతున్నాం కదా అని మనసుకి నచ్చచెప్పుకున్నాయి. అందరూ ఇంటికి చేరుకున్నారు.

మీమీ, కీకీ లు వాటి బోనుల్లో బంధించబడ్డాయి. చక్కటి ఖరీదైన ఆహారం తెచ్చి పెట్టారు. కానీ ఎందుకో వాటికి ఆ ఆహారం రుచించలేదు. ఇదివరకటి స్వేచ్ఛ లేదు. ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి. తిండి తినడం మానేసాయి. ఆహారం లేదు, నిద్రలేదు. ఒకరి మీద ఒకరికి బెంగ ఎక్కువైపోయింది. ఒక వారం గడిచింది. ఆ రెండూ బాగా చిక్కిపోయాయి. అది చూసి ఇంట్లో అందరూ బాధ పడిపోయారు. వెంటనే డాక్టర్ని పిలిచారు. డాక్టర్ చెక్ చేసి "జబ్బేమి లేదు కాకపోతే కొత్త కదా! ఇంకా అలవాటు పడాలి. మీరు ఒక పని చెయ్యండి. కాస్త అప్పుడప్పుడు ఆలా బయటకు తీసుకెళ్లి తిప్పి తీసుకు రండి. కొన్నాళ్ళకి అలవాటు పడుతుంది" అన్నాడు. మర్నాడు ఆదివారం నాడు రాజా తన మీమీని తీసుకొని పార్కుకి వెళ్ళాడు. అదే సమయానికి డాక్టర్ సలహా మేరకు రంగా కూడా కీకీని తీసుకొని అదే పార్కుకి వచ్చేడు. అల్లంత దూరం నుండి ఒకరినొకరు చూసుకున్న మీమీ, కీకీ లు తమ శక్తినంతా కూడదీసుకొని ఒక్క ఉదుటున కిందకి గెంతి, పరుగు పరుగున ఆ రెండూ ఒకదాని దగ్గరకు ఒకటి చేరుకొని కౌగలించుకొని ఏడ్చేశాయి.

ఆ దృశ్యం చూసి నోట మాట రాక అలాగే చూస్తుండిపోయారు అందరూ. వారు తేరుకునేలోగా అవి రెండూ కళ్ళతో సైగ చేసుకొని ఒకటే పరుగు లంఘించుకున్నాయి. పరిగెత్తి పరిగెత్తి అలసిపోయి ఒక దగ్గర ఆగాయి అలుపు తీర్చుకోవటానికి. "ఏమర్రా! ఇన్నాళ్లు ఏమైపోయారు? మీకేమైందో అని అనుకుంటున్నా ఇన్నాళ్ళూ. హమ్మయ్య వచ్చేరా" అంటూ టీ కొట్టు యజమాని పాలు పోసాడు. ఆ గొంతు విని తలెత్తి చూసి, "ఓహో! మన టీకోట్టు దగ్గరికే వచ్చి ఆగామా" అనుకుంటూ గబ గబా పాలు తాగేసి మళ్ళీ పరుగున వెళ్ళి ఆ షాపు ఎదురుగా ఉన్న చెట్టు మీద కూర్చున్నాయి సదరు పిల్లులు రెండూను.

ఈ సారి ఆ షాపు దగ్గరికి వచ్చిన పెట్స్ వైపు జాలిగా చూసాయి "పాపం" అనుకుంటూ. షాపు కట్టేయగానే "ఛీ ఛీ స్వేచ్ఛ లేని జీవితం మాకు వద్దు" అనుకుంటూ చట్టపట్టాలేసుకొని పార్క్ లో ఉన్నతమ గూటికి చేరుకున్నాయి ఆనందంగా ఆ రెండు పిల్లులు.

కథ కంచికి మనం ఇంటికి.

-.పూడి పెద్ది సుధా రమణ






# మూడు అట్ట పెట్టెలు

పంజరంలో ఉన్న చిలుకలు, పంజరానికి ఉన్న చిన్న తలుపును తెరిస్తే, రెప్పపాటులో స్వేచ్ఛగా ఆకాశంలోకి రివ్వున ఎగిరినట్టు, బడి గంట కొట్టగానే పిల్లలందరూ కాళ్లకు రెక్కలొచ్చినట్టుగా, మోత బరువున్న పుస్తకాల బ్యాగును భుజాన వేసుకుని, ఆకాశంలో గాలికి అలల నాట్యం చేస్తున్న జాతీయ జెండాను చూస్తూ, ఒకరిని ఒకరు చూసుకుంటూ, నీకంటే నేనే ముందు స్కూలు గేటు దాటుతాను అంటూ పరుగులు పెడుతున్నారు.

పది నిమిషాలు గడిచింది. అప్పటివరకు, విద్యార్థుల అడుగుల చప్పుడుతో అల్లకల్లోలంగా ఉన్న ఆ స్కూలు ప్రాంగణం, ఉపాధ్యాయులు కూడా వెళ్ళిపోవడంతో, పిల్లల నవ్వులు చూడటానికి రేపటి వరకు ఎదురుచూడాలన్న బెంగతో, కిటికీలు తలుపులు అన్నీ మూసుకున్నట్టే ఉంది.

“అందరి పిల్లలు ఇంటికి వచ్చేశారు. బడి గంట కొట్టి గంట కావస్తోంది. వీడు ఇంకా ఇంటికి రాలేదే, ఎక్కడికి వెళ్ళాడు” అని అంటూ, ఇంటి వరండాలో కూర్చుని చేటలో బియ్యాన్ని చెరిగి, అందులో ఉన్న రాళ్ళని ఏరుతూ, అప్పుడప్పుడు ఇంటి బయటకి కంగారుగా చూస్తూ ఉంది వేణు వాళ్ళ అమ్మ.

అప్పుడే వేణు కూడా, చేతిలో ఏదో కవరు పట్టుకుని ఇంటికి వస్తాడు. ఆ కవరులో ఏముంది, ఎందుకు ఇంత ఆలస్యంగా వచ్చావు అని అమ్మ అడిగేంత లోపే, గబగబా ఇంటి లోపలికి వెళ్ళి, తన వెంట తెచ్చిన కవరుని గట్టిగా ముడివేసి, ఒక మూలన పెట్టి, ఆ కవరు కనబడకుండా తన పుస్తకాల బ్యాగును అడ్డంగా పెట్టి, వెంటనే వెళ్ళి కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కుని, మొహం కూడా కడుక్కున్నాడులే, తర్వాత టవలుతో శుభ్రంగా తుడుచుకుని, స్కూలు యూనిఫాం తీసేసి, బట్టలు వేసుకున్నాక, ఉతకాల్సిన బట్టలు పెట్టే బుట్టలో వేసి, టవల్ ను దండెం మీద ఆరేసి, వరండాలో ఉన్న అమ్మ దగ్గరికి వస్తాడు.

”ఏంట్రా, ఇంత ఆలస్యంగా రావడమే కాకుండా, కవరులో ఏదో తెచ్చావు. అది ఏంటో కూడా చెప్పకుండా ఇంట్లోకి వెళ్ళావు. మళ్ళీ ఏదైనా అల్లరి పని చేస్తున్నావా, దీని గురించి రాగానే మీ నాన్నకి చెప్పమంటావా ఏంటి” అని వేణు వైపు కోపంగా చూస్తుంది అమ్మ. వెంటనే వేణు బతిమాలుతున్నట్టుగా మొహం పెట్టి, అమ్మ దగ్గరగా వచ్చి

# పెద్ద కథ

బియ్యంలో చేతులు పెట్టి, “అదేం లేదమ్మా, స్కూల్లో ప్రాజెక్టు తయారు చేయమని చెప్పారు. అందులో గెలిస్తే బహుమతి కూడా ఇస్తారు. ఆ ప్రాజెక్ట్ తయారు చేసే పనిలో ఉన్నాను. అందుకే ఇప్పుడు కూడా బయటకి వెళ్తున్నా” అంటూ, అమ్మను కౌగిలించుకుని, అలాగే పిడికిలి నిండా చేటలో ఉన్న బియ్యాన్ని పట్టుకుని, అమ్మ గమనించే లోపే, చేయి జేబులో పెట్టుకుని, ఇంటి నుండి బయటకు వస్తాడు.

అమ్మ కూడా లేచి ఇంట్లోకి వెళుతూ, “అరె, పక్కింటి వాళ్ళు ఇచ్చిన వడలు ఇంట్లోనే ఉన్నాయి, తినేసి వెళ్ళు అని చెప్పే లోపే వెళ్ళిపోయాడు” అంటూ లోపలికి వెళ్తుంది. ఇంటి నుండి బయటకి వచ్చిన వేణు గోడ పక్కకు

వెళ్ళి ఎగురుతూ, తను తెచ్చిన బియ్యాన్ని ఆ గోడపై వేస్తాడు. కాసేపటికి కొన్ని పిచ్చుకలు ఆ గోడ దగ్గరికి వచ్చి బియ్యాన్ని తినడం చూసి, తన జేబులో ఉన్న కవరు తీసుకుని, పరిగెత్తుతూ వెళ్తాడు.

తర్వాత రోజు సాయంత్రం,

ఈరోజు కూడా వేణు స్కూలు నుండి, కవరులో ఏవో పెట్టుకుని ఆలస్యంగా ఇంటికి వస్తాడు. కానీ, ఈసారి ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు, వేణు స్నేహితుడు రవి కూడా వేణుకి తోడవుతాడు.

కానీ చీకటి పడే సమయానికి, వేణు ఏడుస్తూ ఇంటికి వస్తాడు. ఆ వెనుకే వేణు నాన్న కూడా కోపంగా ఇంట్లోకి వస్తూ, “చూసావా, నీ కొడుకు బయట ఎలాంటి పనులు చేస్తున్నాడో, వీడు ఏం చేస్తున్నాడో కాస్త పట్టించుకుంటే బాగుంటుంది. రేపు స్కూలుకు వెళ్ళి, వీడి టీచరుతో మాట్లాడాలి” అంటూ, రెండు దెబ్బలు వేణు వీపుపై వేసి, కోపంగా బయటకి వెళ్తాడు.

వెంటనే అమ్మ వేణు దగ్గరకు వచ్చి, “ఏంట్రా, ఏం చేశావ్, మీ నాన్న అంత కోపంగా ఉన్నారు. బయట కూడా కొట్టారా ఏంటి, ఏడ్చి ఏడ్చి మొహం చూడు ఎలా ఉందో, ముందు స్నానం చేసిరాపో, అన్నం తిన్నాక ఈ విషయం గురించి మాట్లాడుదాం” అని సముదాయిస్తుంది.




తర్వాతి రోజు,స్కూలులో, విద్యార్థులు అందరూ తాము చేసిన ప్రాజెక్టులను ఒక్కొక్కరిగా, తమ ఎదురుగా టేబుల్ పై పెడుతున్నారు. అందరూ అట్టపెట్టెలతో, ధర్మాకోల్ తో చేసిన ఇళ్ళు, బొమ్మల్ని పెట్టారు. రవి కూడా పేపరుతో చేసిన చిన్న చిన్న బుట్టలు పెట్టాడు. వేణు మాత్రం, మూడు అట్టపెట్టెలు తన టేబుల్ పై పెట్టాడు. వాటిని చూసిన విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు కూడా ఆశ్చర్య పోయారు.

సాయంత్రానికి, ప్రాజెక్టులు తయారు చేసి, ప్రదర్శించిన విద్యార్థులకు, బహుమతి ప్రదానం చేస్తున్నారు. ఈ ప్రదర్శనకు విద్యార్థుల తల్లితండ్రులు కూడా వచ్చారు. అందరిలోకి, వేణు నాన్న కాస్త ఆలస్యంగా, బహుమతి ఇచ్చే సమయానికి స్కూలుకు వస్తాడు.

అప్పుడే, ఈరోజు ఉత్తమ ఆలోచనను ప్రాజెక్టుగా ప్రదర్శించిన వేణు కి ప్రథమ బహుమతి వచ్చింది అని ప్రకటించడంతో, వేణు స్టేజి పైకి వెళ్తాడు. అక్కడ, వేణు పెట్టిన మూడు అట్టపెట్టెలు పెట్టి, ఉంటారు వాటిని చూసిన వేణు నాన్నకి, తాను వేణు చేసిన పనిని చూసి, తప్పుగా అర్థం చేసుకున్నందుకు బాధపడతాడు.

ఇంతకీ వేణు మూడు అట్ట పెట్టెల్లో ఏమేం ఉన్నాయో

# పెద్ద కథ



తెలుసా, ఒక దానిలో ప్లాస్టిక్ బాటిల్ మూతలు, ఇంకు అయిపోయిన పెన్నులు. ఇలా చిన్న చిన్న ప్లాస్టిక్ వస్తువులు. ఇంకో పెట్టెలో, కాల్చి పారేసిన సిగరెట్ పీకలు,చాక్లెట్ రేపర్లు. మిగిలిన మూడవ పెట్టెలో, విద్యార్థులు మధ్యాహ్నం తినగా మిగిలిన అన్నం మెతుకులు ఉన్నాయి.

కొన్ని రోజుల క్రితం, స్కూల్లో టీచర్, మనం బయట పడవేసే చెత్తను ఆహారంలా తిని, ఎన్నో పక్షులు, జంతువులు, చివరికి సముద్రంలో చేపలు కూడా చనిపోతున్నాయని, చనిపోయాక వాటి కడుపులో ప్లాస్టిక్ మూతలు, కవర్లు, గాజు ముక్కలు కూడా ఉంటున్నాయి, దాని వలన మన పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుంది అని చెప్పడంతో, వేణు ఆ సమస్యను తగ్గించడానికి, సిగరెట్ పీకలు ఏరడం నాన్న చూసి తనని కొట్టినా సరే, తను చేయాలనుకున్న పనిని చేసి చూపించాడు.

వేణు ఆలోచన మెచ్చిన ప్రధానోపాధ్యాయులు గారు, ఇక నుండి మన పాఠశాలతో పాటు, అన్నీ పాఠశాలల్లో కూడా ఈ మూడు అట్టపెట్టెలు ఏర్పాటు చేసేలా, విద్యాశాఖాధికారితో కూడా మాట్లాడుతానని చెబుతారు. దానితో, అందరూ చప్పట్లతో వేణుని అభినందిస్తారు.

\- ప్రవీణ్ నిజమూల




బలవంతుడ నాకేమని
పలువురితో నిగ్రహించి పలుకుట మేలా
బలవంతమైన సర్పము
చలిచీమల చేత జిక్కి చావదె సుమతీ!

భావం

నేను చాలా బలవంతుడ్ని. నాకేమీ భయం లేదని నిర్లక్ష్యం చేసి విర్రవీగి విరోధం తెచ్చుకోవడం మంచిది కాదు. అది ఎప్పుడూ హాని కలిగిస్తుంది. ఎంతో బలం కలిగిన సర్పం కూడా చలిచీమలకు లోబడి చావడం లేదా?

## విహారి





# శుకవనం-పారేట్ పార్క్

మనం చిన్నప్పుడు ఉదయం లేచిన వెంటనే పక్షుల కిలకిల రావాలను వినసొంపుగా మన చెవులను తాకేవి. ఆ ధ్వనుల సవ్వడులు మనసుకు ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తూ ఆ రోజు చేయాల్సిన పనులను మరింత ఆసక్తితో చేసేలా మార్చేవి. అయితే ఆధునికత అంటూ అందుబాటులో ఉన్న సదరు పక్షులకు ఆవాసమైన చెట్లనంతటిని మనం కొట్టేస్తున్నాం. దీంతో పక్షులకు నిలువ నీడలేకుండా పోతోంది. ఇక వాటికి కావాల్సిన గింజలు కూడా మన పట్టణాల్లో దొరకడం లేదు. దీంతో వాటి సంతతి రోజురోజుకూ పడిపోతోంది. దీంతో ఇప్పుడిప్పుడే పక్షి ప్రేమికులు ఉద్యమాలు లేవనెత్తుతున్నారు. చెట్లను కొట్టకుండా అడ్డుకొంటున్నారు. మరికొంతమంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కొన్ని పక్షులను దత్తత తీసుకొని వాటిని పెంచుతున్నారు. అయితే అవి కూడా పదుల సంఖ్యలో మాత్రమే ఉంటున్నాయి.

ఇందుకు భిన్నంగా ఒకే చోట దాదాపు 2వేల చిలుకలకు రక్షణ కల్పించే ప్రాంతం ఒకటుంది. ఇన్ని వేల సంఖ్యలో చిలుకలు ఒకే చోట ఉండటంతో గిన్నీస్ బుక్ వారు కూడా ఆ ప్రాంతానికి తమ పుస్తకంలో చోటు కల్పించారు. అంతేకాకుండా ఆ ప్రాంతం ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది.

మైసూర్ పర్రోట్ మ్యూజియం అంటే మైసూర్‌లోని శూక వన (Shuka Vana) అని అర్థం, ఇది శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ఉన్న ఒక ప్రత్యేకమైన పక్షుల ఆవాసం, ఇక్కడ 450 పైగా జాతులకు చెందిన 2,200 పక్షులు ఉన్నాయి మరియు అరుదైన, గాయపడిన, వదిలివేయబడిన పక్షులకు ఆశ్రయం కల్పిస్తారు, ఇది ప్రపంచంలోనే అత్యధిక పక్షి జాతులకు నిలయం అని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూడా పొందింది.


కొన్నేమో చెట్లపైన చేరి ఊసులాడుకుంటాయి. మరికొన్నేమో చొరవగా మన భుజాలపైన చేరి గారాలుపోతాయి. ఇంకొన్ని కొమ్మల మాటు నుండి తొంగిచూస్తూ దాగుడుమూతలాడుతాయి. ఏంటీ ఆ చిట్టి చిలుకల్ని ఓసారి చూడాలనిపిస్తుందా.అయితే 3ఎకరాల

# విహారి



విస్తీర్ణంలో 100అడుగుల ఎత్తుండేలా నెట్ లాంటిదాన్ని ఏర్పాటుచేసారు.లోపల పెద్దచెట్లు, పూలమొక్కల్నీపెంచి చిన్నచిన్న ఫౌంటేన్ లను ఏర్పాటు చేసిన సుక వనానికి బయలుదేరండి .పసుపూ కుంకుమలు అద్దినట్టు ఎరుపుపసుపు వర్ణాల కలబోతగా కొన్ని క్యాన్వాస్ మీద మోడరన్ ఆర్ట్ వేసినట్టు 6,7 రంగుల మిశ్రమ వర్ణంలో కొన్ని కొంగల్లాకనిపించే తెల్లటి చిలుకలు మరికొన్ని.పాల పిట్టల్లా నీలిరంగుల్లో మరికొన్ని ఓరపిచ్చుకంతవాటి నుండి డేగంత వాటి వరకు విభిన్నరకాలు చెట్టు చెట్టుకు ఎదుగుతూ అప్పుడప్పుడూ మన భుజం మీద వాలుతూ కనిపిస్తే ఆ ఆనందం అంతాఇంతా అని చెప్పగలమంటారా.ఈ అనుభూతిని అచ్చంగా ఆస్వాదించాలంటే కర్ణాటకరాష్ట్రం మైసూర్ లోని గణపతి సచ్చిదానందదత్తపీఠం వాళ్ళు నిర్వహిస్తున్న శుకవనానికి వెళ్ళాల్సిందే. ఒకరోజు ఒక గాయపడ్డ చిలుక కింద పడిపోయి గణపతి సచ్చిదానందస్వామికి కనిపించిందట. అప్పుడాయన దాన్ని చేతుల్లోకి తీసుకుని సపర్యలుచేశారు. కోలుకున్న చిలుక రెక్కలాడిస్తూ ఆయన భుజంపై వాలిందంట. అప్పట్నుంచి ఆశ్రమం చుట్టుపక్కల ఏ పక్షి అనారోగ్యంతో దొరికినా సపర్యలు చేసేవారు స్వామీజి.tచిలుకల్నీ పెంచటం ప్రారంభించారు. ఆయనకు చిలుకల పట్ల వున్న ప్రేమను చూసిన విదేశీభక్తులు ఆయా దేశాల చిలుకల్ని బహుమానంగా తెచ్చేవారు. ఇప్పుడందులో విభిన్న దేశాలు,ఖండాల్లోని మొత్తం 465జాతులకు చెందిన 2000లకు పైగా చిలకలున్నాయి.









# అక్బర్-బీర్బల్ కథలు





## గజేంద్ర మోక్షం

ఒక రోజు అక్బర్ బీర్బల్ ని సరదాగా ఆట పట్టించాలని అనుకున్నారు.

“బీర్బల్, నాకొక సందేహముంది, తీరుస్తావా? అలనాడు విష్ణుమూర్తి ఒక ఏనుగు ఆర్తనాదాలు విని వెంటనే దాన్ని రక్షించడానికి పరిగెట్టాడని నేను వేద పురాణాలలో వుందని విన్నాను. యెందుకలా? అక్కడ సేవకులెవరూ లేరా?” అని అక్బర్ బీర్బల్ ని అడిగారు.

బీర్బల్ ఇలా జవాబు చెప్పాడు, “సామ్రాట్, మీ సందేహం నేను సమయమొచ్చినప్పుడు తీరుస్తాను!”

కొన్ని రోజులు గడిచాయి. బీర్బల్ ఒక పనిమనిషిని పిలిచి ఆమె చేతికొక మైనపు బొమ్మను ఇచ్చాడు. బొమ్మ అచ్చు ఒక శిశువు రూపంలో ఉంది. “ఈ రోజు నేను మహారాజుతో తోటలో ఉన్నప్పుడు, ఈ బొమ్మని తీసుకుని నీట్లో పడిపోయినట్టు నటించు, నీకు మంచి బహుమానమిప్పిస్తాను,” అని ఆ పనిమనిషికి చెప్పాడు.

అలాగే పనిమనిషి సాయంత్రం అక్బర్, బీర్బల్ తోటలో విహరిస్తుంటే తోట నడిమధ్య ఉన్న మడుగులో కాలు జారి పడిపోయినట్టు నటించింది. తనతో పాటు ఆ శిశువు బొమ్మకూడ నీళ్ళల్లో పడిపోయింది.

అక్బర్ ఈ దృశ్యం చూడగానే వెంటనే నిండు బట్టలతోనే నీళ్ళల్లోకి దూకి ఆ శిశువు బొమ్మని కాపాడ సాగాడు.

బీర్బల్ మడుగు గట్టున నిలుచుని, “మహారాజా, యెందుకు మీరు నీళ్ళల్లో దూకరు? సేవకులని పురమాయిస్తే సరిపోయేది కదా?” అన్నాడు.

“ఒక శిశువు ప్రాణాపాయ స్థితి లో కనిపిస్తే మీరు యెలా ముందూ వెనకా చూడకుండా ఆదుకోవాలనుకున్నారో, విష్ణుమూర్తి కూడా అలాగే తన భక్తుడైన ఆ ఏనుగుని కాపాడడానికి వెనకాడలేదు” అని చాలా తెలివిగా అక్బర్ సందేహం తీర్చాడు.

★★★

## తెనాలిరామకృష్ణ కలు



# మాయా ఉంగరం

ఒకసారి విజయనగరంలో నగల వ్యాపారులు రెండు రోజుల పాటు, బంగారం వజ్రాలతో చేసిన హారాలు, ఉంగరాలు, వడ్డాణాలు ఇలా అన్ని రకాల నగలను ప్రజల కోసం సందర్శనకు ఉంచుతారు.

మొదటి రోజు నగల ప్రదర్శన విజయవంతంగా జరుగుతుంది. కొనుగోళ్లు కూడా బాగా జరగడంతో, నగల వ్యాపారులు మరికొన్ని నగలను తర్వాతి రోజు ప్రదర్శనకు తెప్పిస్తారు.

అయితే, తర్వాతి రోజు ప్రజలు అందరూ నగల ప్రదర్శనశాలకు రాగానే అక్కడ ఒక్క నగ కూడా ఉండదు. దానితో బయట కాపలా ఉన్న భటులతో పాటు, ప్రజలు కూడా ఆశ్చర్య పోతారు. ఇక నగల వ్యాపారులైతే తమ నగలు కనిపించక పోవడంతో లబోదిబో మని ఏడుస్తూ, అందరూ కలిసి పరుగున తమ సమస్యను పరిష్కరించమని అడగడానికి రాజ సభకు బయలుదేరుతారు.

శ్రీకృష్ణదేవరాయుల వారు రాజ్య విషయాల గురించి సభికులతో చర్చిస్తూ ఉండగా, నగల వ్యాపారులు కొంతమంది ప్రజలతో కలిసి రాజ సభకు వచ్చి, మహారాజు గారి అనుమతితో మంత్రి అప్పాజీ గారితో జరిగిన విషయం అంతా చెప్పి, "కనిపించకుండా పోయిన నగలను, తిరిగి మా వద్దకు చేర్చండి" అని వేడుకుంటారు.

వెంటనే అప్పాజీ, "మహారాజ, మొదటి రోజు నగల ప్రదర్శన విజయవంతంగా ముగిసింది. దానితో రెండవ రోజు ప్రదర్శన కోసం ఇంకొన్ని నగలను తెప్పించారు. కానీ, రెండవ రోజు ప్రదర్శనకు వెళ్ళిన ప్రజలకు ఒక్క నగ కూడా కనిపించలేదు. వేసిన తలుపులు వేసినట్టే ఉన్నాయి. బయట భటులు కాపలా ఉన్నారు. అయినా నగలు అన్నీ మాయం అయ్యాయి, నగలను ఎవరు దొంగతనం చేశారో తెలియడం లేదు. దొంగల గురించి ఒక చిన్న ఆధారం కూడా దొరకలేదు మహారాజ" అని చెబుతాడు.

అంతా విన్న శ్రీకృష్ణదేవరాయుల వారు ఆశ్చర్యంగా చూస్తూ, "ఇదేదో మాయలా ఉందే, దొంగ ఎవరికీ కనిపించకుండా నగలు అన్నిటినీ మాయం చేశాడా ఏంటి?" అని అనగానే, ప్రజలలో ఉన్న ఒక ముసలి వ్యక్తి

# తెనాలిరామకృష్ణ కథలు




ముందుకు వచ్చి, "మహారాజ, మీరు హాస్యానికి అన్నా, మీరన్నది నిజమే మహారాజ. నేను నా చిన్నప్పుడు మా నాన్న గారు చెబితే విన్నాను. అప్పట్లో ఒక వర్తకుడికి సముద్రంలో ఒక మాయా ఉంగరం దొరికిందట, ఆ ఉంగరం వేలికి ధరించాక అతను ఎవరికీ కనబడలేదు, అతని మాటలు మాత్రమే వినిపించాయి. దానితో, అక్కడ ఉన్న వారందరూ దయ్యం దయ్యం అని అక్కడినుండి పారిపోతే, అక్కడ ఉన్న ధనాన్ని తీసుకుని పోయాడు. అలా పారిపోయిన వారిలో మా నాన్నగారు కూడా ఒకరు" అని చెబుతాడు.

ఆ ముసలి వ్యక్తి మాటలు విన్న ప్రజలతో పాటు, సభికులు కూడా నవ్వుతూ ఉండగా, అప్పుడే ఎవరో విసిరి వేసినట్టు ఒక లేఖ సభ మధ్యలో పడుతుంది. వెంటనే ఆ లేఖను తీసుకుని చూసిన మంత్రి అప్పాజీ ఆశ్చర్యపోతూ, "మహారాజ, ఈ ముసలి వ్యక్తి చెప్పింది నిజమే, నిజంగానే ఆ మాయా ఉంగరం ఉంది. దానికి ఈ లేఖనే సాక్ష్యం. ఆ దొంగ మన రాజ సభకు వచ్చి, ఈ లేఖను విసిరేసి ఎవరికంటా పడకుండా బయటకి వెళ్ళిపోయాడు. ఈ లేఖలో, ఈరోజు రాత్రికే అందరూ చూస్తూ ఉండగానే, అంతఃపురంలో ప్రదర్శనకు ఉంచిన రాజదండాన్ని తీసుకుని వెళ్ళిపోతాను. ఒకవేళ మీరు నన్ను పట్టుకుంటే, ఆ మాయా ఉంగరంతో పాటు నేను దొంగిలించిన నగలను కూడా ఇచ్చేస్తాను అని సవాల్ చేస్తున్నాడు మహారాజ" అని చెబుతాడు.

వెంటనే శ్రీకృష్ణదేవరాయుల వారు సభికుల వైపు చూస్తూ, "ఆ దొంగ రాజ మందిరం నుండి బయటకు వెళ్ళే లోపు పట్టుకోవాలి. లేకపోతే, తరతరాలుగా అంతఃపురంలో ఉన్న రాజ దండం మనది కాకుండా పోతుంది. తెనాలి రామలింగడు గారు మీరే ఏదైనా ఉపాయం ఆలోచించి, రాజ దండంతో పాటు వ్యాపారుల నగలను కూడా రక్షించాలి" అని ఆజ్ఞాపిస్తారు.

వెంటనే రామలింగడు పైకి లేచి శ్రీకృష్ణదేవరాయుల వారికి నమస్కరిస్తూ, "అలాగే మహారాజ, దొంగ ఎంత తెలివిగా వ్యవహరించినా అతను చేసేది తప్పు కాబట్టి పట్టుబడక తప్పదు. మన సైన్యాధికారి వర్ధనుడుతో కలిసి ఆ దొంగను ఎలాగైనా పట్టుకుంటాం" అని చెబుతాడు. దానితో ప్రజలు, నగల వ్యాపారులు కూడా మహారాజుకు నమస్కరించి, రాజ సభ నుండి



బయటకు వెళ్తారు.

కాసేపటి తర్వాత, మంత్రి అప్పాజీ, సైన్యాధికారి వర్ధనుడు, తెనాలి రామలింగడితో సమావేశం అవుతారు. ముగ్గురూ ఆ దొంగను ఎలా పట్టుకోవాలి అని రకరకాలుగా చర్చించుకుంటారు. కొద్దిసేపటికి ఒక నిర్ణయానికి వచ్చి, ఇలా చేస్తే దొంగ దొరికిపోతాడు అని అనుకుని, ఎవరికి వారు సమావేశ మందిరం నుండి బయటకి వస్తారు. వీరందరూ బయటికి వెళ్ళాక, ఆ మాయా ఉంగరం ధరించి సమావేశ మందిరంలోనే ఉన్న దొంగ నవ్వుకుంటూ, "మీరు నన్ను పట్టుకోవాలని వేసిన పథకం నాకు తెలిసి పోయింది కదా, ఇక నన్ను పట్టుకోవడం మీ వల్ల కాదు" అని అంటూ, అక్కడి నుండి అంతఃపురం వైపు వెళ్తాడు.

తర్వాతి రోజు..

నగల వ్యాపారులు, ప్రజలు అందరూ ఆ దొంగను పట్టుకున్నార లేదా అని తెలుసుకోవడానికి రాజ సభకు వస్తారు. కాసేపటికి, సభికుల జయజయధ్వానాల మధ్య మహారాజు శ్రీకృష్ణదేవరాయల వారు కూడా సభకు విచ్చేసి సింహాసనంపై కూర్చుంటారు. సభలో అందరూ ఉన్నారు

# తెనాలిరామకృష్ణ కథలు



గానీ, తెనాలి రామలింగడు మాత్రం లేదు.

వెంటనే శ్రీకృష్ణదేవరాయుల వారు మంత్రి అప్పాజీ వైపు చూడగా, అప్పాజీ తన చేతులతో రెండు సార్లు చప్పట్లు కొడతాడు. కాసేపటికి, రాజ దండం గాలిలో నడుస్తూ మహారాజు దగ్గరికి వస్తుంది. దానిని చూసిన మహారాజుతో పాటు సభలో ఉన్న అందరూ ఆశ్చర్యపోతారు.

అప్పుడు రామలింగడు తన చేతికి ఉన్న ఉంగరాన్ని తీయడంతో అందరికీ కనబడతాడు. వెంటనే రామలింగడు తన చేతిలో ఉన్న రాజ దండాన్ని తిరిగి అంతఃపురంలో పెట్టించమని భటులకు ఇచ్చి, తన చేతిలో ఉన్న మాయా ఉంగరాన్ని మహారాజు చేతిలో పెడతాడు.

ఆ ఉంగరాన్ని, దాని శక్తిని చూసిన శ్రీకృష్ణదేవరాయుల వారు ఆశ్చర్యపోతూ, “ఇంత శక్తి ఉన్న ఉంగరం తన దగ్గర ఉండి కూడా ఆ దొంగ ఎలా దొరికాడు రామలింగడు గారు” అని అడుగుతాడు.

దానికి రామలింగడు, “మేము మంత్రి గారు, సైన్యాధికారి వర్ధనుడుతో కలిసి సమావేశ మందిరంలో దొంగను పట్టుకోవడానికి ఒక పథకం రచించాం. కానీ, వేరే చిన్న ఉపాయం వల్ల దొంగ దొరికి పోయాడు మహారాజ. ఎందుకంటే, ఆ సమావేశ మందిరంలో మాతో పాటు ఆ దొంగ కూడా మాయా రూపంలో ఉండి, మా పథకం అంతా విన్నాడు కాబట్టి. అందుకే, రాజదండం ద్వారానే ఆ దొంగను పట్టుకున్నాం మహారాజ. ఎలా అంటే, కొన్ని శబ్దం వచ్చే గంటలను రాజ దండానికి కట్టించాం. దొంగ రాత్రి పూట రాజ దండాన్ని దొంగిలిస్తాను అని చెప్పాడు కాబట్టి, చీకటి పడిన వెంటనే మందిరంలో పూజ చేస్తూ, చేత్తో గంటలు మోగిస్తూనే ఉండమని చెలికత్తెలకు చెప్పాం. దానితో వారు గంటలు మోగిస్తూనే ఉన్నారు. ఇక చీకటి పడ్డాక దొంగ రాజ దండాన్ని మందిరం నుండి తీసుకున్నాడు. అలా తీసుకున్న వెంటనే, చెలికత్తెలు గంటలు మోగించడం ఆపి వేశారు. రాజ మందిరానికి ఉన్న మూడు ద్వారాల వద్ద భటులు సిద్ధంగా ఉన్నారు. ఆ దొంగ రెండవ ద్వారం గుండా బయటకి రాగానే, అప్పటికే చేతుల్లో పట్టుకుని ఉన్న వలను దొంగపై వేయడంతో, దొంగ పట్టుబడ్డాడు” అని చెబుతాడు.

అప్పుడు శ్రీకృష్ణదేవరాయుల వారు, “దొంగ ఉంగరం పెట్టుకోవడం వల్ల మనకు కనబడదు కానీ అక్కడే ఉంటాడు, అందువల్లే దొరికిపోయాడు. బాగానే ఉంది కానీ, అసలు దొంగ మందిరం యొక్క రెండవ ద్వారం నుండే బయటకు వచ్చాడు అని భటులకు ఎలా తెలిసింది?” అని అడుగుతాడు.

వెంటనే రామలింగడు, “మహారాజా, దొంగ రాజ దండం తీసుకున్న వెంటనే అంటే, రాజదండం కనబడకుండా పోయిన మరుక్షణమే, చెలికత్తెలు గంటలు మోగించడం ఆపివేశారు. అప్పుడే, రాజ దండానికి మనం కట్టించిన గంటలు మోగడం మొదలు పెట్టాయి. అప్పటికే గంటల శబ్దం వింటుండడం వల్ల, దొంగ రాజ దండం నుండి వస్తున్న శబ్దాన్ని పట్టించుకోకుండా, తను ఎవరికీ కనబడను అని దర్జాగా మందిరం ద్వారం నుండి బయటకు వచ్చాడు. కానీ, రాజ దండంకు కట్టిన గంటల శబ్దం భటులు వినడంతో దొంగ దొరికిపోయాడు” అని చెబుతాడు.

**-ప్రవీణ్ నిజమాల**

# "రోబో "సంగతులు

కృత్రిమ మేధ(Artificial Intelligence): మనిషి ఏదైనా పనిచేసే ముందు దాని గురించి ఆలోచించి, విషయాలను గ్రహించి, సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరిస్తాడు. అదే పనిని యంత్రాల సాయంతో అత్యంత నేర్పుగా లేదా సమర్థవంతంగా చేయడాన్ని కృత్రిమ మేధగా పేర్కొంటారు

బాట్స్ (Bots) : ఆటోమేటిక్‌గా పనులు చేసేందుకు ప్రోగ్రామ్ చేయబడిన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు; అవి మానవ ప్రమేయం లేకుండా, వేగంగా, పునరావృతమయ్యే పనులను పూర్తి చేస్తాయి. మన సూచనలను అనుసరించి, మానవ ప్రమేయం లేకుండా స్వతంత్రంగా పనిచేస్తాయి. మానవులు చేయగలిగే దానికంటే చాలా వేగంగా పనులను పూర్తి చేయగలవు.



చాట్‌బాట్‌లు: వెబ్‌సైట్‌లలో ప్రశ్నలకు సమాధానాలు ఇస్తాయి.

రోబోట్ లు:మానవుల్లా పనులు చేసే కృత్రిమ మేధతో నడిచే యంత్రాలు

సోఫియా :హాంకాంగ్ కంపెనీ హాన్సన్ రోబోటిక్స్ ద్వారా 2016లో సృష్టించబడిన మానవ రూపాన్ని పోలిన ఒక సోషల్ హ్యూమనాయిడ్ రోబోట్. మొదటి రోబోట్ పౌరురాలు (సౌదీ అరేబియా).

ఏ ఐ రోబోట్ టీచర్ : ఐరిస్ రోబో మాట్లాడుతుంది, కళ్లు కదుపుతుంది, కదులుతుంది.. నిజమైన టీచర్ లాగానే ఉంటుంది. రోబో అని తెలియనివ్వకుండా ఇంగ్లీష్, హిందీ, మలయాళం మూడు భాషల్లో మాట్లాడగలదు.





## కథ



# వెంటాడే అదృష్టం

భూషణం మాణిక్యం వీర్రాజు  పేద రైతులు. రచ్చబండ దగ్గర ఒకరి కష్టసుఖాలు ఒకరు చెప్పుకునేవారు. ఎవరికీ తోచిన సలహాలు సూచనలు చెప్పుకునేవారు కూడా.

విత్తనాలు కోసం దాచుకున్న డబ్బులు  ఒకరు కూతురు పురిటికి కొడుకు పట్నం చదువు కోసం  ఇంకొకరు భార్య అనారోగ్యం కోసం చేయ్యి జారిపోయావి.

విత్తనాలకోసం డబ్బులు లేక బాధ పడ్డారు.

ఈ విషయం అదృష్టదేవతకు తెలిసి వారికి ధన సహాయం చేయాదలచి బయలుదేరి ముందుగా భూషణం ఇల్లు చేరి మూయబడివున్న యింటి తలుపులుని శబ్దం చేసింది.

భూషణం తలుపులు తెరవకుండా “ ఎవరు....? వేళపాలా లేకుండా వచ్చారు....? యిప్పుడు నేను మంచి పనిలో వున్నాను. తర్వాత రండి “ అన్నా మాటలకు దేవత వెనుతిరిగి మాణిక్యం ఇల్లుని చేరింది ఆయింటి తలుపులు కూడా మూసి ఉండడంతో శబ్దం చేసింది. మాణిక్యం కూడా  తలుపులు తెరవకుండా యేవో మాటలు చెప్పి పంపించే సాడు  దేవత చివరి ప్రయత్నంగా వీర్రాజు ఇల్లు చేరింది. అక్కడ కూడా తలుపులు మూసి ఉండడంతో శబ్దం చేసింది. అసమయంలో వీర్రాజు ఎన్నో పనులు చేసుకొని శారీర బడలికతో  ముద్ద మింగుతుండగా శబ్దం విని తలుపులు తెరచి ఎదురుగా కనిపించిన ఆ రూపాన్ని చూసి ఒక్కసారి గతుక్కుమని “ ఎవరమ్మా నువ్వు  నాతో ఏమి పని......? సంశయంగా అడిగాడు.

దేవత “ నేను అదృష్ట దేవతను  నీకష్టం తెలుసుకొని సహాయం చేయదలచి ఈ ధనరాశులు ఇవ్వదలచాను వీటితో  నీ పొలానికి కావలసిన విత్తులు కొనుక్కో  యింటి సమస్యలు సరి పెట్టుకో  అని మూట అందించినది.

వీర్రాజు అమితానందంతో “ చాల కృతజ్ఞతలు తల్లి నాతో పాటు ఇద్దరు స్నేహితులు కూడా వున్నారు  వారికి కూడా నీ కటాక్షం చూపించు తల్లీ “ వేడుకున్నాడు. దేవత నవ్వి “  నేను ముందు వారి ఇళ్ళకే వెళ్లి తలుపులు తట్టాను  కాని వాళ్ళు కనీసం తలుపులు విప్పకుండా ఏవేవేవో  వినిపించారు అటువంటి సోమరి వ్యక్తులుకి నా కటాక్షం ఎప్పుడు కలుగదు. అయితే నీ స్నేహానికి కట్టుబడి e  ధనరాసులు వారికి సహాయం చేసిన పక్షంలో  రాళ్లు రప్పలు గా మారిపోతవి “ అని దేవత అదృశ్యామైపోయినది.

వీర్రాజు ఎవరు ఎన్ని పనుల్లో వున్నా  అదృష్టం అన్నది తలుపు తట్టాగానే తెరవాలి అప్పుడే ఆతల్లి  కటాక్షిస్తుంది అనుకున్నాడు.

**-ఆరుపల్లి గోవిందరాజులు**

# మెదడుకు మేత – 1



## పొడుపు కథలు :

1. ఎనిమిది ఎముకలు ! తట్టెడు ప్రేగులు !! ఏమిటో చెప్పండి ?

2. ఆకాశం లో అరవై గదులు ! గదికో సిపాయి !! ఏమిటో చెప్పండి




## కనుక్కోండి చూడడం :

పక్కన ఉన్న బొమ్మలో ఏడూ క్కపిల్లలున్నాయి . వాటిలో ఒక్కటే నిజమయిన కుక్క పిల్ల , మిగతావన్నీ బొమ్మలే . నిజమయిన కుక్క పిల్ల ఎదో కనిపెట్టండి.

## కొంటె ప్రశ్నలు :

1. ప్రపంచం లో కెల్లా ఎత్తైన పర్వతం ఎవరెస్ట్ . ఆ పర్వతాన్ని కనుక్కోకముందు , ఏది ఎత్తైన పర్వతం ?

2. కిలో దూది బరువైనదా , కిలో పంచదార బరువైనదా ?







# ఒంటి కొమ్ము రాక్షసుడు

పూర్వం చంద్రగిరి రాజ్యం లో వున్న తిమ్మా పురం అనే ఊరి లో రామరాజు, భీమరాజు అనే ఇద్దరు స్నేహితులు వుండేవారు. చదువు పూర్తి చేసుకున్నా వాళ్ళకి ఆ వూళ్ళో ఉద్యోగం ఏమీ దొరక లేదు.

" మనం రాజధాని నగరానికి వెళ్లి ప్రయత్నం చేద్దాం. అక్కడ మనకి ఏదో ఒక పని దొరకక పోదు" అన్నాడు రామరాజు.

" అవును, మనం ఒకరికి ఒకరం తోడుగా వుంటాం కాబట్టి మన అమ్మా నాన్నలు కూడా ఇందుకు అభ్యంతరం చెప్పరు!" అన్నాడు భీమరాజు.

మర్నాడు చీకటి తోటే రాజధాని నగరానికి ప్రయాణం అయ్యారు వాళ్ళు. రాజధాని నగరం చేరుకోడానికి పెద్ద అడవిని దాట వలసి వుంది. వాళ్ళు మధ్యాహ్నానికి అడవి లోకి ప్రవేశించారు. దట్టమైన ఆ అడవిలో రంగు రంగుల పక్షులను, చిన్న చిన్న జంతువులను చూస్తూ ఇద్దరూ హుషారుగా నడుస్తున్నారు. కొద్ది దూరం వెళ్ళగానే వాళ్ళకి ఒక చెరువు కనిపించింది.

" ఆకలిగా ఉంది. ఈ చెరువు గట్టు మీద కూర్చుని భోజనం చేసి బయలుదేరుదాము" అన్నాడు భీమరాజు.

ఇద్దరూ చెరువు గట్టు మీద కూర్చుని , తమతో తెచ్చుకున్న పులిహోర, పెరుగన్నం తిని, చెరువులో నీళ్ళు తాగి మళ్ళీ బయలు దేరారు. కాసేపు నడవగానే వాళ్లకు దూరంగా కొండలు, ఆ కొండల మీదనుంచి క్రిందకు పడుతున్న జలపాతం కనిపించాయి.

" ఎంత అందంగా వుంది ఆ దృశ్యం! అక్కడికి వెళ్లి కాసేపు ఆ జలపాతం దగ్గిర సేద తీరుదాము" అన్నాడు భీమరాజు ఉత్సాహంగా ఆ వైపుకే చూస్తూ.

ఇద్దరూ తమ దారి వదలి జలపాతం కేసి నడవడం మొదలు పెట్టారు. వాళ్ళు కొండలను సమీపిస్తూ వుండగా , " ఎవర్రా మీరు? ఇక్కడ మీకేం పని? వెళ్ళండి, వెనక్కి వెళ్ళండి!" అన్న భీకరమైన కంఠం వినిపించింది. ఇద్దరూ హడలి పోయి అడ్డంగా చెట్ల మీదనుంచివ్రేలాడుతున్న తీగలు పక్కకు తోసి చూశారు. దగ్గర లోనే ఒక పెద్ద బండరాయి మీద ఒక ఒంటి కొమ్ము రాక్షసుడు కూర్చుని వున్నాడు. వాడిని చూడగానే ఇద్దరి స్నేహితుల గుండెల్లో దడ మొదలు అయింది.

# కథ

భయంతో వణికిపోతూ అక్కడే నిలబడి పోయారు ఇద్దరూ.

"ఇంకా అక్కడే నిలబడి వున్నారేం? మంచి గా చెబితే మీరు వినేలా లేరు. లేచి రమ్మంటారా?" అని హుంకరించాడు రాక్షసుడు.

ఇద్దరూ బతుకు జీవుడా అనుకుంటూ వెనక్కి పరుగు లంఘించు కున్నారు. కొంత దూరం పరిగెత్తే సరికి వాళ్లకు కట్టె పుల్లలు ఏరుకుంటున్న ఒక తాత కనిపించాడు.

తాత వాళ్ళని చూస్తూనే, "పిల్లలూ, ఎందుకా పరుగు? ఏ నక్క అయినా వెంట పడిందా?" అని అడిగాడు.

దానికి రామరాజు, "నక్కలకు, కుక్కలకు భయపడే రకాలం కాదు. అక్కడొక ఒంటి కొమ్ము రాక్షసుడు ఉన్నాడు. నువ్వు చూడలేదా తాత?" అని అడిగాడు.

ఆ మాటలకు తాత," ఆ ఒంటి కొమ్ము రాక్షసుడు ఎప్పుడూ ఆ బండ మీద నే కూర్చుని వుంటాడు.ఎవరికి ఎటువంటి హానీ చేయడు. కానీ ఎవరినీ ఆ బండ దాటి వెనక వైపు కు వెళ్ళ నీయడు! అందరూ ఆ రాక్షసుడు తన సంపద అంతా ఆ వెనక వున్న గుహ లో దాచి, దానికి కాపలా కాస్తూ, ఆ బండ మీదనే కూర్చుని వుంటాడనిచెప్పుకుంటారు!"అని తాత కట్టెల మోపు తల మీద పెట్టుకుని వెళ్లి పోయాడు.

ఏదో ఆలోచిస్తూ నిలబడి వున్న భీమ రాజు భుజం తడుతూ, "ఇక బయలు దేరుదామా?" అన్నాడు రామరాజు.

"ఆగు, నాకు ఒక అద్భుతమైన ఆలోచన వచ్చింది. ఆ రాక్షసుడి సంపద మనం కాజేస్తే నగరానికి వెళ్లి పని వెతుక్కునే తలనొప్పి వుండదు. మన వూళ్ళో నే మహారాజు లా కాలు మీద కాలు వేసుకుని బతక వచ్చు. ఏం అంటావు?" అన్నాడు భీమ రాజు.

"ఆలోచన బావుంది కానీ ఆ రాక్షసుడి సంపద కాజేయడం అంత సులభం అనుకుంటున్నావా?" అన్నాడు రామ రాజు.

"రాక్షసుడు రాత్రి పడుకుంటాడు కదా, అప్పుడు ఆ బండ దాటి వెనక వున్న గుహలో వెతుకుదాము" అన్నాడు భీమ రాజు.



ఇద్దరూ ఆ రాక్షసుడి బండ కి దగ్గరలో వున్న మర్రి చెట్టు ఎక్కి కొమ్మల మధ్య రాక్షసుడి కి కనిపించక కుండా కూర్చున్నారు. చూస్తుండగానే చీకటి పడింది. రాక్షసుడు నిప్పు రాజేసి నాలుగు అడవి కోళ్లను కాల్చుకుని సుష్టుగా భోజనం చేశాడు. తరువాత వాడు అర్ధరాత్రి దాకా పిచ్చి పదాలు పాడుకుని, ఆ బండ మీదనే పడుకున్నాడు. కాసేపట్లోనే అడవి దద్దరిల్లి పోయేలా గుర్రు పెట్టడం ఆరంభించాడు రాక్షసుడు.

వాడి గురక విని ధైర్యం తెచ్చుకుని చిన్నగా చెట్టు దిగారు ఇద్దరూ. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ రాక్షసుడి బండ దగ్గరకు వచ్చారు . దగ్గరగా చూస్తే రాక్షసుడి రూపం మరింత దడ పుట్టిస్తోంది. ఇద్దరూ ఆ బండ దాటారు. రాక్షసుడు ఎక్కడ నిద్ర లేస్తాడో అని వెనక్కి వెనక్కి చూస్తూ అడుగులు వేస్తున్న వాళ్ళు ఒక్కసారిగా పెద్ద ఊబి లో పడి పోయారు. తాము ఊబిలో పడిన సంగతి అర్థం అయ్యే లోపల నడుం దాకా మునిగి పోయారు వాళ్ళు.

ఇద్దరూ చావు భయం తో, "రక్షించండి, రక్షించండి! ఊబిలో పడి పోయాం !" అని గట్టిగా ఏడవడం మొదలు పెట్టారు.

# కథ

“ మిమ్మల్ని వెళ్లి పొమ్మని చెప్పాను కదా, మళ్లీ వెనక్కి ఎందుకు వచ్చారు? ఎవరూ ప్రమాదవశాత్తు ఈ ఊబి లో పడకూడదనే ఇంత కాలం ఎండ అనకా వాన అనకా ఇక్కడ కాపలా కాస్తున్నాను. ఏం లాభం, మీరు దొంగ చాటుగా వచ్చి పడనే పడ్డారు. భయపడకండి, నేను వస్తున్నాను!“ అంటూ ఊబి లోకి దూకేసాడు రాక్షసుడు. వాడు రామ రాజు ని, భీమ రాజు ని ఊబి లో నుంచి పైకి లాగి గట్టు మీదకు విసిరేశాడు. తరువాత వాళ్ళిద్దరూ చూస్తుండగానే ఒంటి కొమ్ము రాక్షసుడు ఊబి లో పూర్తి గా మునిగి పోయాడు.

అప్పుడే చిన్నగా వెలుగు వస్తోంది. స్నేహితులు ఇద్దరూ జలపాతం క్రింద ఒళ్ళు శుభ్రం చేసుకున్నారు.

“ పాపం ఆ రాక్షసుడు గొప్ప పరోపకారి! వాడికి సంపద లేదు, అక్కడ అసలు గుహ కూడా లేదు. జనాన్ని రక్షించడానికి జీవితం ధార పోసిన త్యాగశీలి!“ అన్నాడు భీమరాజు.

“ వాడు రాక్షసుడు అయినా పరోపకారం కోసమే బతికాడు! మనం వాడి సొత్తు కాజేయాలని ఆశ పడ్డాం! నిజంగా మనం చేసిన తప్పు కి సిగ్గు తో చచ్చి పోవాలని వుంది!“ అన్నాడు రామరాజు.

“ ఈ అనుభవం తో మనం బుద్ధి తెచ్చుకుని ఇక మీదట అయినా నిజాయితీ తో కష్టపడి జీవిద్దామని ప్రమాణం చేసుకుందాం !“అన్నాడుభీమరాజు.

అలా ప్రమాణాలు చేసుకున్నాక తేలిక పడిన మనసుతో నగరం వైపు నడక మొదలు పెట్టారు ఆ ఇద్దరూ.

**-మాచిరాజు కామేశ్వర రావు**



### బాల గేయం
## నారు మడి

అమ్మా!అమ్మా!

నీ ఒడే తొలి మా బడి!

నీ మాటే తొలి నారు మడి!!

అమ్మా!అమ్మా!

నీ మాటలే మూలమంత్రం!

అమ్మా!అమ్మా!

నీ సలహాలే మాకు అమూల్యం!

అమ్మా!అమ్మా!

నీ మాట ఎన్నటికీ జవదా టం!

అమ్మా!అమ్మా!

ఏ వయసులో నిను వదిలిపెట్టం!

అమ్మా!అమ్మా!

నీవే మా మార్గదర్శనం!!

అమ్మా!అమ్మా!

నీవే మా చక్కెర చిలకమ్మా!!


**-ఇనకోట రవికుమార్**

# మెదడుకు మేత – 1



ఈ లెక్కల లెక్క తెల్చేయండి ......

| | | | | |
|---|---|---|---|---|
| 6 | + | | = | 14 |
| + | | + | | + |
| | + | 9 | = | |
| = | | = | | = |
| | + | 17 | = | 30 |



# కథ



# కబుర్ల కుందేలు

మర్రి చెట్టు కింద పొదల్లో ఒక కుందేలు ఉండేది. దానికి పనికి మాలిన కబుర్లు చెప్పందే నిద్రపట్టేది కాదు. మర్రిచెట్టు తొర్రలో ఉండే ఉడుతమ్మకు కుందేలు చెప్పే కబుర్లు వినడం అంటే మహా ఇష్టం.

అవి రెండూ ప్రతిరోజూ తమ పక్కనలేని జంతువు గురించో, పక్షి గురించో హేలనగా మాట్లాడుకుంటూ సంబర పడేవి.అదే మర్రి చెట్టు మీద రెండు కాకులు గూళ్లు కట్టుకొని నివసిస్తున్నాయి.

చెట్టు కింద కుందేలు, ఉడతమ్మలు చెప్పుకునే సోది కబుర్లు కాకుల చెవుల్లో పడేవి.అవి కుందేలు, ఉడుతమ్మతో.. ఎవరో చెప్పగ విన్న ఇతరుల కష్టాలు,సమస్యలు నిజమో .. కాదో విచారించకుండా వాటిని మరొకరితో పంచుకుని ఆనంద పడటం మంచిదికాదు. మానుకోమని చెప్పాయి.

"మీకు నచ్చకుంటే వినకండి !" అని కాకుల్ని కసురుకొని వాటితో మాట్లాడటం మానేశాయి కుందేలు, ఉడుతమ్మలు.

ఒకరోజు ఒక ఏనుగు వచ్చి మర్రి చెట్టు నీడలో కొద్దిసేపు సేద తీర్చుకొని వెళ్ళిపోయింది. వెంటనే పొదల్లోంచి కుందేలు పరుగున వచ్చి " ఉడుతమ్మా ! ఉడుతమ్మా: !! ఏనుగు తొండం విరిగిందటగా ! మన కోతిబావనే తొండానికి వైద్యం చేసి కుట్లు కుట్టాడట! అందుకే.. ఇప్పుడు పక్షుల గూళ్లు, చెట్టుకొమ్మలు విరవటం లేదు " అంది కుందేలు. " అవునా ! ఈ విషయం నాకు తెలియదే !!" ఆశ్చర్యంగా అంది ఉడుతమ్మ.

" అవునట ! నేను మొన్న చెరువు దగ్గర నీళ్లు తాగుతున్నపుడు తెలిసింది !' అంది కుందేలు. " మనం మంచి వాళ్ళం కనుక, ఆ భగవంతుడు మనకు తొండాలివ్వలేదు !" అంది ఉడుతమ్మా.

మరో రోజు సాయంత్రం, మృగరాజు సింహం పరుగులాంటి నడకతో మర్రి చెట్టు మీదుగా ఇంటికి పోతున్నాడు. సింహం మర్రి చెట్టు దాటగానే కుందేలు

# కథ





ఉరికి వచ్చి

" ఉడుతమ్మా ! ఉడుతమ్మా: !! ఇది విన్నావా ! మృగరాజుకిరాత్రైతె కళ్లు కనిపించవట ! మొన్న రాత్రి దుప్పి దాని ముందు నుంచి పోయినా, చూడలేదట !" అంది కుందేలు. " ఏమోనమ్మా !

మనకు ఇలాంటి రోగాలు లేవు. పగలైనా, రాత్రైనా చూడగలుగుతాం.

ఇంకో రోజు నక్క మర్రి చెట్టు చుట్టుపక్కల కొద్దిసేపుతిరిగి వెళ్ళిపోయింది. అది వెళ్ళగానే కుందేలు వేగంగా వచ్చి " ఉడుతమ్మా ! ఉడుతమ్మా: !! నక్క నోట్లో వేలు పెట్టినా కొరకలేదటగా ! దాని పళ్లన్నీ ఊడిపోయాయట ! ఇప్పుడు సింహం వదిలేసిన మాంసం ముట్టడం లేదట !" అంది కుందేలు.

" అవునా ! ఐనా ఎవరో తిని వదిలేసినవి, కుళ్లి పోయినవి తిని బ్రతకటంకూడా.. ఒక బ్రతుకేనా !" అంది ఉడుతమ్మ.

ఇంతలో నక్క తిరిగి వచ్చి రెండు కుందేలు పిల్లల్ని నోట కరిచి ఎత్తుకు పోయింది.

అది చూసిన కుందేలు " అమ్మో ! నక్క నా పిల్లల్ని కరుచుకు పోతుంది.కాపాడండీ ! కాపాడండీ !!" అని మొత్తుకుంది.

ఉడుతమ్మ భయపడి తొర్రలో తన పిల్లలు ఉన్నాయో లేదో చూసుకోటానికి చెట్టెక్కింది.

కుందేలు అరుపులు విని చెట్టుపై రెండు కాకులు పెద్దగా అరుస్తూ నక్కను వెంబడించాయికాకుల అరుపులు విన్న ఇతర కాకులు అక్కడికి చేరి నక్కను అడ్డగించాయి.

నక్క భయపడి కుందేలు పిల్లల్ని వదిలేసింది.కాకులు రెండు మర్రి చెట్టు కొమ్మపై వాలాయి. ఉడుతమ్మ ఇదంతా తొర్రలోంచి చూస్తూనే ఉంది. గద్ద రోజూ మర్రి చెట్టు మీద కూర్చొని ఉడుత పిల్లల్ని తన్నుకు పోవటం కోసం చూస్తుందని హెచ్చరించాయి కాకులు.

ఏనుగు తొండం తెగలేదుకేవలం బెణికింది.అది అల్లరి పనులు మానడం వలన చెట్లజోలికి పోలేదు. సింహం కంటిచూపు బాగానే ఉంది.ఆకలి లేకపోవటం వలన దుప్పిని వేటాడలేదన్న విషయాలు కాకుల ద్వారా తెలుసుకుంది కుందేలు.

ఇక నక్కకు నోటినిండా పళ్లున్నట్లు పిల్లల్ని పంటితో కరుచుకు పోయినప్పుడు చూసింది కుందేలు.

మన పక్కనలేని వారి పై చెడుగా పనికి మాలిన కబుర్లు చెప్పటానికి, వినటానికి బాగున్నా, వాటివలన సమయం వృధా తప్ప, ఎటువంటి ప్రయోజనం ఉండదని గ్రహించాయి కుందేలు, ఉడుతమ్మ.

ఇంతకాలం తమ మాట విననందుకు మన్నించమని కాకుల్ని కోరాయి. '.ఇతరుల మీద చెడుగా పనికి మాలిన కబుర్లు చెపితే ఆపాపం తమ పిల్లలకు చుట్టుకుంటుందని' భయపడి ఆనాటి నుండి తమ గురించి ఆలోచించటం నేర్చుకున్నాయి కుందేలు, ఉడుతమ్మలు.

**-పైడిమర్రి రామకృష్ణ**

# ముల్లా నసీరుద్దీన్ కథలు






## తెలివి ఒకడి సొత్తు కాదు

ఒకసారి అకస్మాత్తుగా నసీరుద్దీన్కు కడుపునొప్పి వచ్చింది. అది త్వరగా తగ్గేటట్లు కనిపించలేదు... వైద్యుణ్ణి సంప్రదించాడు. అతడు మందు ఇస్తూ ఉదయం సాయంత్రం బాగా నడవమని సలహా ఇచ్చాడు. నసీరుద్దీన్ ఆ సలహాను పాటించాడు. రోజూ ప్రొద్దున్నే, సాయంత్రం ఊరి చివరి వరకూ నడవసాగాడు. నడక అతడికి హాయి అనిపించింది.

ఒకరోజు సాయంత్రం మామూలుగా నడవటం సాగించాడు. ఊరు దాటి మైదానంలోకి వచ్చాడు. వాతావరణం ప్రశాంతంగా ఉంది. చల్లని గాలి వీస్తున్నది. అతడికి హాయిగా అనిపించింది. మైమరచి నడవసాగాడు. అతడు నడిచే దారి ప్రక్కన శ్మశానం కూడా ఉన్నది.

చాలా దూరం ఏవేవో ఆలోచించుకుంటూ నడిచాడు. ఒకచోట ఆగిచూస్తే సూర్యుడు అస్తమించి చిమ్మ చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఊరు చాలా దూరంలో ఉన్నది. ఇంటికి వెళ్లటానికి వెనక్కు తిరిగి నడవటం సాగించాడు.

E

ఆ చీకటిలో వెనుక నుంచి గుర్రపు స్వారీ చప్పుళ్లు వినిపించాయి. వెనక్కు తిరిగి చూశాడు. దూరం నుంచి కొంత మంది గుర్రాల మీద వస్తున్నట్లు కనిపించింది. 1 వాళ్లు బందిపోటు దొంగలని అతడికి అనుమానం వచ్చింది. వెంటనే భయం వేసింది.

ముచ్చెమటలు పోశాయి. పరుగు లంఘించుకున్నాడు. అలా కొంతదూరం వెళ్లి వెనక్కు తిరిగి చూశాడు. దొంగలనుకున్న వారు అతని వెనుకనే వస్తున్నారు. వారు అతడిని వెంబడిస్తున్నట్లు అర్థం అయ్యింది. నసీరుద్దీన్ను దోచుకోవాలన్నదే వారి= పన్నాగం.

ఒకచోట మలుపు వచ్చింది. ఆ మలుపులో వెనుక వస్తున్న వారికి నసీరుద్దీన్ జాడ కనిపించలేదు. దారిలో శ్మశానం వచ్చింది. అతడు వెంటనే శ్మశానంలోకి = పరుగెత్తాడు. కాస్త ఊపిరి పీల్చుకొని ఆలోచించాడు. దగ్గరలో సగం తీసిన గొయ్యి కనిపించింది. తను ఇంకాస్త మట్టితీసి ఆ గోతిని లోతుగా చేశాడు. దానిలో దిగి వెల్లకిలా పడుకున్నాడు.

దొంగలు ఎలాగో అతడి జాడ కనిపెట్టి శ్మశానంలోని గోతిని సమీపించారు. దానిలో పడుకుని ఉన్న నసీరుద్దీన్ను చూశారు. ఒకడు వంగి చూశాడు. నసీరుద్దీన్ = ముఖంలో చిరునవ్వు కనిపించింది.

# ముల్లా నసీరుద్దీన్ కథలు



"మమ్మల్ని తప్పించుకోవాలని ఇక్కడకు వచ్చావా ? ఏం చేస్తున్నావిక్కడ ?" అని వారిలో ఇంకొకడు అడిగాడు.

నసీరుద్దీన్ కదలిక లేకుండా శవంలాగా పడి ఉన్నాడు. కాని పెదవులను మాత్రం మెల్లిగా కదిలించి ఏదో గొణగసాగాడు. "ఎవరినుండీ తప్పించు కోవలసిన అవసరం నాకు లేదు. నేను చచ్చిపోయినవాడిని. వారం అయ్యింది నేను చచ్చిపోయి. నన్ను ఈ గోతిలోనే పూడ్చి పెట్టారు. గోతిలో చాలా ఉక్కగా ఉంది. చచ్చిపోయిన – వారికి కూడా స్వచ్ఛమైన చల్లగాలి కావాలి కదా ! అందుకని గోతిలో నుంచి పైకి వస్తాను. చల్లగాలిని అనుభవిస్తూ చాలా దూరం నడుస్తాను. అలా తిరిగి వచ్చేటప్పుడే = మీరు నన్ను చూశారు."

వారు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. గోతిలోకి వంగి చూశారు. ఆ సమయంలో నసీరుద్దీన్ చచ్చిన వాడిలా బిర్రబిగుసుకొని కళ్ళు విప్పి తీక్షణంగా చూడసాగాడు. వారి ముఖాలు పాలిపోయాయి.

అందులో ఒకడు "ద... ద... ద... దయ్యం" అంటూ సణిగాడు. ఇంకొకడు – "పదండి... పదండి... ఈ దయ్యం నుండి రక్షించుకుందాం..." అన్నాడు. వారు గజ గజ వణుకుతూ గుర్రాలెక్కి అక్కడ నుంచి ఉడాయించారు.

నసీరుద్దీన్ నవ్వుకున్నాడు. గోతి నుండి పైకి వచ్చాడు. ఆ దొంగలు భయంతో ఒక ఈటె, బాకు అక్కడ పడవేసి వెళ్లారు. వాటిని తీసుకుని గుర్తుగా దాచుకున్నాడు.★★★★



### మన బాల గేయాలు

## ఏనుగమ్మ ఏనుగు

ఏనుగమ్మ ఏనుగు
ఏ ఊరెళ్ళిందేనుగు
మా ఊరెళ్ళిందేనుగు
మంచినీళ్ళు తాగిందేనుగు
ఏనుగమ్మ ఏనుగు
ఏ ఊరెళ్ళిందేనుగు
మా ఊరెళ్ళిందేనుగు
మంచినీళ్ళు తాగిందేనుగు
ఏనుగు ఏనుగు
నల్లన ఏనుగు కొమ్ములు తెల్లన
ఏనుగు మీద రాముడు
ఎంతో చక్కని దేవుడు



# కథ





## పేరు

ఒకరోజు రాంబాబు తన స్నేహితుడైన రాముని చూడ్డానికి వాళ్ళింటికి వెళ్ళాడు. అక్కడ రాము నాన్నమ్మ రాంబాబు ని చూసి.

“నీవు ఎవరి మనవడవు? “ అని అడిగింది రాంబాబుని.

“ సుబ్బయ్య గారి మనవడిని” అన్నాడు. రాంబాబు

“ ఆ గుమ్మడికాయల దొంగ సుబ్బయ్య మనవడివా? అని దీర్ఘాలు తీస్తూ బుగ్గలు నొక్కుకుంది అవ్వ.

రాంబాబుకి ఏమీ అర్థం కాలేదు. ‘ఎందుకలా అవ్వ తాతయ్యని అంటుంది’ అనుకున్నాడు.

కొన్ని రోజుల తర్వాత దారిలో ఒక ముసలాయన “ మీ తాత గారి పేరు ఏమిటి? “ అని రాంబాబుని అడిగాడు.

“ మా తాత గారి పేరు సుబ్బయ్య” అన్నాడు. రాంబాబు.

“ఓ గుమ్మడికాయల దొంగ సుబ్బయ్య మనువడివా? అ పక్క వీధిలో ఉన్న ఇల్లు కదా ? అని తన దారిన తాను వెళ్ళి పోయాడు.

రాంబాబు చాలా బాధ పడుతు “నాన్న ఎందుకిలా అడుగుతున్నారు తాతయ్య గురించి” ఇలా నిన్ను ఎవరు అడగరు” తన నాన్నను అడిగాడు రాంబాబు.

“తాతయ్య సమవయస్కులు అలాగే అడుగుతారు. “అవేమీ పట్టించుకోవద్దు” అన్నాడు రాంబాబు తండ్రి.

ఇలా అడగడం జరుగుతూనే ఉన్నది. రాంబాబు బాధపడుతూ ఉండడం జరిగేది. ఇలా రాంబాబుకు పెళ్లై ఉద్యోగం చేస్తున్నాడు. కానీ రాంబాబు ప్రశ్నకు సమాధానం దొరక లేదు.

ఒకరోజు ఆ ఊరికి ఒక స్వామి వస్తే అందరూ చూడడానికి వెళ్లారు. అప్పుడు రాంబాబు ఆ స్వామిని చూసి.

“స్వామి నాకు ఒక సందేహం చిన్నప్పటినుండి గమనిస్తున్నాను. నన్ను ఎవరి మనువడివని అడగడం, ఓ గుమ్మడికాయలు దొంగ సుబ్బయ్య మనవడివా?” అంటూ తనకు జరిగిన విషయాలన్నీ చెప్పాడు.

“మా తాతగారు నేరం చేసినట్టు. మాటిమాటికి గుమ్మడికాయల దొంగ సుబ్బయ్య మనవడివంటూ ఎగతాళి చేస్తున్నారు. నవ్వుతున్నారు. దీనిలోని అర్థం ఏమిటో నాకు బోధ పడటం లేదు స్వామి” అని అడిగాడు.

# కథ



వెంటనే స్వామి ఇలా అన్నాడు “చూడు బాబు, ఎప్పుడో మీ తాతయ్య పక్కింటి గుమ్మడి కాయని పక్కింటిది కదా? అని అడుగక తీసుకొని ఉండవచ్చు. ఆ తర్వాత అ ఇంటి వారు అలా ప్రచారం చేసి ఉండవచ్చు. నీవు వీలైతే ఓ పది రోజులు పేదవారికి అన్నం పెట్టు” తర్వాత వచ్చి కనిపించు” అన్నారు.

రాంబాబు ఓ పది రోజులు యాభై మందికి రోజూ భోజనాలు పెట్టాడు.

ఓ నెల రోజులు గడిచింది. అ స్వామి తిరిగి ఆ ఊర్లోకి వచ్చాడు.

అప్పుడు ఆ ఊర్లో వారు స్వామి దగ్గరి కొచ్చి, “రాంబాబు చాలా మంచి వారండి. లేదన్న వారికి అన్నం పెడుతున్నాడు” కష్టం వస్తే ఆదుకుంటున్నాడు.” అని అంటుటే, స్వామికి ఆనందం వేసింది.

తిరిగి స్వాములవారిని కలవడానికి వెళ్ళాడు రాంబాబు.

“ స్వామి ఇప్పుడు అందరు నన్ను ఊర్లో అన్నం పెట్టిన రాంబాబు” అని పిలుస్తున్నారు. అని అన్నాడు. దీని అర్థం స్వామి ?“ అని అడిగాడు రాంబాబు.

స్వామి నవ్వి “బాబు ప్రజల మనస్తత్వమే అంతే. మంచి పని చేస్తే అదే చెప్పు కుంటారు. చెడు పని చేసినా చెప్పు కుంటారు. అన్నం పెట్టావు. ఇప్పుడు చూడు. అన్నం పెట్టిన రాంబాబు” అని అంటున్నారు. అందుకే మనం మన వీలయినంత వరకు మంచి పనే చేయాలి. ఇది లోకం తీరు. నీకు మనవడు వచ్చేంతవరకు ఈ పేరు ఇలాగే ఉంటుంది” అని స్వామి నవ్వి దీవించి పంపించాడు రాంబాబుని.

రాంబాబు తన పిల్లలకు మంచి నేర్పించి, వారిని ప్రయోజకులుగా తీర్చి దిద్ది, తనకు ముని మనవళ్లు వచ్చినా, తన పేరుని ఆ ఊర్లో చిర స్థాయిగా నిలుపుకున్నాడు.

**-ఏ. ఉషారాణి**

బాల గేయం

## తేనె లొలుకు భాష

తియ్యని భాష ప్రాచీన భాష

పద్య భాష కమ్మనైన భాష

కావ్యమయ భాష రాయలోరి భాష

రతనాల భాష గిడుగు వారి భాష

వ్యవహార భాష గొప్పదైనా భాష

గేయ భాష అమృతమయ భాష

అజరామర భాష

పండిత భాష పామర జన భాష

బ్రౌన్ గారు మెచ్చిన భాష

బ్రౌన్ నిఘంటు భాష

ఇటాలియన్ అఫ్ ది ఈస్ట్ మన తెలుగు భాష

దేశ భాషలందు మేటి ఈ భాష

మనకు వెలుగునిచ్చిన భాష

అదే.. అదే మాతృ భాష

మన తెలుగు భాష

**- ఏడుకొండలు కళ్ళేపల్లి**

# కథ





## రామచిలుక పెళ్ళి

ఒక పెద్ద జామచెట్టు ఉండేది. ఆ చెట్టు కాయలు చాలా తియ్యగా ఉండటంతో.. రోజు ఒక రామచిలుక వచ్చి జామకాయలు తినేది. రోజు చిలక రావడం తో జామ కాయలు చిలుక తో స్నేహం చేయసాగాయి. కొన్ని రోజులకి చిలుక మరియు జామ కాయలు మంచి స్నేహితులు అయిపోయాయి.

చిలుక కొన్ని రోజులు జామ చెట్టు వైపు రాలేదు. తన స్నేహితురాలికి ఏమైందో అని బెంగ పెట్టుకున్నాయి జామ కాయలు. ఇలా కొన్ని రోజులు గడిచాక ఒక రోజు చిలుక జంట గా వచ్చి చెట్టు పై వాలింది. తన స్నేహితురాలిని జంటగా చూసి జామ కాయలు చిలుకను ఏడిపించసాగాయి 'ఎవరు ఆ చిలుక,నీకు ఏమీఅవుతుంది ?' అని . చిలుక తనతో జంటగా వచ్చిన చిలుకను తన ప్రియుడు అని స్నేహితులకి పరిచయం చేసింది.

రోజు చిలుక జంటగా స్నేహితుల దగ్గర కి వచ్చేది. తన స్నేహితురాలిని జంటగా చూసి జామకాయలు సంతోషించేవాళ్ళు.

ఒక రోజు చిలక ఒకర్తే రావడం తో స్నేహితులు నీ జంట ఏది? అని అడిగారు. "చిలక వాళ్ల పెద్దలతో మాటలాడి మా లగ్గం కి ముహూర్తం పెట్టించుకుని వస్తా అని వెళ్లాడు.. కాని ఇంకా రాలేదు" అని దిగాలుగా చెప్పింది. స్నేహితులు "నీ ప్రియుడు తప్పకుండా వస్తాడు" దిగులు పడకు అని ధైర్యం చెప్పారు.

రోజు చిలుక తన ప్రియుడు ఎప్పుడు వస్తాడో అని ఎదురు చూస్తూ ఉండేది.. ఇంతలో ఒక రోజు చిలుకకు ఉత్తరం వచ్చింది.. ఆ ఉత్తరం పట్టుకుని జామ చెట్టు పై వాలింది. చిలుక ఉత్తరం తేవడం చూసి స్నేహితులు అందరు చిలుక చుట్టూ గుమి గూడారు .

చిలుక ఉత్తరం చదివి సిగ్గుపడింది. స్నేహితులు ఉత్తరంలో 'ఏమీ ఉంది అంత సిగ్గు పడుతున్నావు ?' అని అడిగాయి. ఇంతలో ఒక జామకాయ ఆత్రం ఆపుకోలేక చిలుక దగ్గరనుంచి ఉత్తరం తీసుకుని అందరికి చదివి

# కథ



వినిపించింది " ఈ మాఘ మాసం లో మన లగ్గం" అని రాసుంది అంది, ఆ మాట విన్న మిగత జామకాయలు ఆనందం తో గెంతులు వేశాయి.

చిలకల జంట మాఘ మాసం ఎప్పుడు వస్తుందో అని ఎదురు చూస్తున్న సమయంలో " ఒక తుంటరి పిల్లాడు జామకాయ కోసం రాయిని విసిరాడు.. రాయి జామకాయకి బదులుగా చెట్టుపైన కూర్చున్న రామచిలుక తండ్రికి తగిలి అక్కడికి అక్కడే చనిపోయాడు".

తండ్రి చావుతో చిలుక దిగాలు పడిపోయింది. ఇంతలో మాఘమాసం వచ్చింది, చిలుక ప్రేమికుడు కుటుంబం పెట్టుపోతలు ఏమీ లేక పోయిన పరవాలేదు.. కాని లగ్గం మాత్రం "అంగరంగ వైభోగంగా జరగాలి అని గెట్టిగా చెప్పారు". దాంతో "ఈ లగ్గం జరగడం కష్టం" అని బెంగ పెట్టుకుంది చిలుక.

చిలుక దిగులు,బెంగని చూడలేక తన స్నేహితులు ఓదార్చుతూ ఉన్న సమయంలో రామచిలుక కుటుంబ సభ్యులు అందరూ వచ్చి మేము అందరం "మీ నాన్న లేని లోటు మేము తీర్చలేము కానీ నీ లగ్గం మాత్రం నీ ప్రియుడు కుటుంబం కోరుకున్నట్టు మేము జరిపిస్తాం అది మా భాజ్యాత" అని చెప్పి.. ఆకాశం అంత పందిరి, భూదేవి అంత పీట వేసి, అతిథి సత్కారాలు బాగా చేసి,మేళ తాళాలతో అంగరంగ వైభవంగా జామ చెట్టుపైనే లగ్గం జరిపాయి. రామచిలుక ఎంతో ఆనందంగా అత్తారింటికి వెళ్ళింది తన స్నేహితురాలి ఆనందం చూసి చాలా సంబర పడిపోయాయి జామకాయలు.

**-గంటి ఆశ పద్మిని**

# కథ





## దైవ వివాహం

పూర్వం పాంచాల దేశాన్ని పౌరసీలుడు అనే రాజు పాలించేవాడు. అతని భార్య పేరు మిత్రవింద. వీరి వివాహం జరిగి చాలా కాలం అయినప్పటికీ సంతానం కలగనందున కుల గురువు చెప్పిన విధంగా తన రాజ్యాన్ని మంత్రిమహేంద్రవర్మకు అప్పజెప్పి అడవి కెల్లి గోదావరి తీరంలో బ్రహ్మ దేవుని గూర్చి తపము ఆచరించ సాగాడు.

ఒకనాడు ఆ గోదావరి నదిలో స్నాన మాచరించుటకు వచ్చిన భ్రుగుడను ఋషి తపం చేస్తున్నా రాజును చూసి "ఓ రాజా! నీవు తపస్సు చేయుటకు కారణమేమి? అన్ని ప్రశ్నించగా అందుకు రాజు"మునీశ్వరా! నాకు సంతానం లేని కారణంగా సంతానంకై నేను ఈ తపస్సు ప్రారంభించాఅని చెప్పాడు.

అప్పుడు ముని వేషంలో ఉన్న బ్రహ్మ"రాజా! నీవు ఈ ఘోర తపస్సును సాగిస్తూ కూర్చున్నావే తప్ప నీ ముందు ప్రత్యక్షంగా ప్రత్యక్షమై, నీ యోగక్షేమాలు అడుగుతున్నా ఈ బ్రాహ్మనే గుర్తించలేకపోతున్నావు. అనగానే రాజు కళ్ళు తెరిచి తన ఎదుట ఉన్న ఋషిని చూసి"ఏమని సెలవిస్తేరి ఋషి పొంగవా? నా దైవం బ్రహ్మ ప్రత్యక్షమయ్యారా! వేడి ? ఎక్కడ? అంటూ రాజు నలువైపులా చూడగా, నలువైపులా అతనికి ఋషిపుంగవుడేకనిపించాడు. వెంటనే రాజు బ్రహ్మ దేవుని లీలలను గుర్తించి తనకు సంతాన భాగ్యం కలిగించమని కోరాడు. తథాస్తు అంటూ ముని రూపంలో ఉన్న బ్రహ్మదేవుడు దీవించి అంతర్ధానమయ్యాడు.

బ్రహ్మ వర ప్రభావం వల్ల రాజు భార్యకు ఆడపిల్ల కలిగింది. ఆ అమ్మాయికి విధాత్రి అని పేరు పెట్టుకుని అల్లారు ముద్దుగా పెంచసాగారు.

అమ్మాయి యుక్త వయసుకు రావడం చే" రాజు భార్య మిత్రవింద" నాథా ! అమ్మాయి పెండ్లీడుకు వచ్చింది. ఓ మంచి వరుణ్ణి వెతికి వివాహం కావిద్దం. అని కోరగా" అలాగే దేవి! ఈరోజు నుండే నేను వరాన్వేషణలో నిమగ్నం అవుతానని చెప్పాడు రాజు.

పొరుగు రాజకుమారుడైన గుణశీలునకిచ్చి పెళ్లి చేయాలని తలంచి రాజు విధాత్రి జాతక చక్రం కులగురువుకు చూపించి జాతక ఫలం చెప్పమని కోరాడు.

# కథ




గురువు జాతక చక్రం పరిశీలించి "రాజా! మీ కుమార్తె జాతకంలో ఓ దోషం ఉంది. ఆ దోషం వల్ల నీవు ఈ పెళ్లి చేయలేవు అని అనగా". రాజు దీనా వదనంతో "అదేంటి గురువర్యా? బ్రహ్మ దేవుని వర ప్రభావంతో జన్మించిన నా బిడ్డకా దోషం అంటూ పరివేదన చెంది, అదేంటో సెలవివ్వమని కోరాడు. అప్పుడు నీ బిడ్డ వివాహం అయిన తక్షణం మీ అల్లుడు మరణిస్తాడు. కాన వివాహం మానుకోండి అని గురువు చెప్పాడు.

ఇక అప్పటి నుండి రాజదంపతులు దుఃఖ భారాన్ని మోయలేక సతమతమౌతూనే, కూతురు పెళ్లి ఎలా చేయాలో అర్థం కాక ఉన్న పరిస్థితి గమనించిన మంత్రి "వారిని ఓదారుస్తూ! మహారాజా! బ్రహ్మ వరప్రసాదిని అయిన నీ కుమార్తెకు జాతక చక్రంలో దోషం ఉందంటే నేను నమ్మలేకపోతున్నా! ఒకవేళ ఉంటే, ఆ దోష నివారణ మార్గం కూడా ఉంటుంది గా, ఆ మార్గం ఏదో తెలుసుకొని ఆచరిస్తే సరిపోతుందిగా అనగానే" మహామంత్రి! ఆ దోష పరిహార నిమిత్తమై ఏం చేయాలని మరల కుల గురువును కోరగా రాజా! ఈ దోష నివారణ చేయగల సత్తా కేవలం మహాతపసంపన్నుడైన అజాతశత్రు జిత్తుకే ఉందని చెప్పగా, వెంటనే అజాతశత్రువుని కలిసేందుకు ఏర్పాట్లు చేయమని మహామంత్రిని ఆదేశించాడు రాజు.

ఓ శుభ ముహూర్తాన రాజదంపతులు అజాతశత్రుజిత్తు మహా మునిని కలుసుకొని, దోష పరిహార మార్గం తెలుసుకున్నారు. వరుడైన గుణశీలుని ప్రతిమను తయారు చేయించి విధాత్రితో పెండ్లిగాయించారు. పెళ్లి తంతు ముగిసిన వెంటనే గుణశీలుని ప్రతిమ వెయ్యి ముక్కలయ్యింది.

ఈ హఠాత్ పరిణామానికి విధాత్రి మతి తప్పి కింద పడిపోయింది. అలాగే రాజమందిరం ప్రక్క గదిలో నున్న గుణశీలునికి శరీరమంతా గాయాలైనాయి.

దోషం తప్పిపోయి కుమార్తె వివాహం ఏ విఘాతం లేకుండా జరుగుతుందనుకున్న రాజు భద్రతప్పి పడిపోయిన బిడ్డను, గాయాల పాలైన అల్లున్నీ చూసి భరించలేక"ఓ బ్రహ్మదేవా! నీవు ప్రసాదించిన బిడ్డను, ఆమె భర్తను గాయాల పాలు చేసి మమ్ముల ఎందుకింత బాధ పెడుతున్నావ్? ఈ బాధ భరించలేం? మేము నీ సన్నిధిలోకి వస్తున్నా అంటూ రాజుగారు తన



కరవాలంతో తన తల నరుక్కునపోగా, బ్రహ్మ వెంటనే ప్రత్యక్షమై,"రాజా! ఈ సాహసానికి, నీ భక్తికి, నీ బిడ్డ పై గల అనురాగానికి మెచ్చాను లే. అనగానే, రాజకుమార్తె స్పృహ నుండి మేల్కొని లేచింది.


గాయామయమైన అల్లుడు గుణశీలుడు కూడా గాయాలు మాయమై కోలుకున్నాడు.

అందరూ ఒకరిని ఒకరు చూసుకుని అంతా ఏకమై భక్తి ప్రపత్తులతో బ్రహ్మదేవుని కొలిచారు.

బ్రహ్మ దేవుని సమక్షంలోనేవిధాత్రి గుణ శీనుల వివాహం అంగరంగ వైభవంగా జరిగిపోయింది.

**-గుర్రాల లక్ష్మారెడ్డి**

# పంచతంత్రంకథలు



## నక్క - నాగుపాము



ఒక అడవిలో ఒక పెద్ద మర్రి చెట్టు ఉండేది, అక్కడ రెండు కాకులు – భార్యాభర్తలు, ఒక మంచి గూడును తయారు చేసుకుని దానిని తమ నివాసంగా చేసుకున్నారు. అదే చెట్టు తొర్ర లో, ఒక నల్ల నాగుపాము నివసించేది.ఆడ కాకి తన గుడ్లను పొదిగినప్పుడల్లా నల్ల నాగుపాము చెట్టుపైకి ఎక్కి కాకి పిల్లలను తింటుంది. వాటిని రక్షించడానికి కాకులు ఏమీ చేయలేకపోయాయి.

కాకులు సమీపంలోని మర్రి చెట్టులో నివసించే నక్క వద్దకు సలహా కోసం వెళ్ళాయి. వారు అతనికి ప్రతిదీ చెప్పి, వారి సమస్య నుండి బయటపడటానికి అతని సలహాను కోరారు.

"ఓ మిత్రమా, ఇక్కడ నివసించడం ప్రమాదకరంగా మారింది. దుష్ట నల్ల నాగుపాము మన పిల్లలను తినకుండా ఎలా రక్షించుకోవాలో దయచేసి మాకు చెప్పండి."అని అడిగాయి .

"భయపడకండి శక్తివంతమైన శత్రువులను కూడా తెలివితేటలతో ఓడించవచ్చు" అని నక్క బదులిచ్చింది.

ఇది విన్న కాకులు, "ఓ మిత్రమా, ఈ దుష్ట నాగుపాముని మనం ఎలా అధిగమించి నాశనం చేయవచ్చో చెప్పు" అని అడిగాయి.

నక్క వారికి ఒక ఉపాయం చెప్పింది.



# పంచతంత్రంకథలు

"ఇక్కడికి దూరంగా ఉన్న రాజ్య రాజధానిలో ఓ ధనవంతుడి ఇంటికి వెళ్లండి. అక్కడ విలువైన హారం ఉంటె , అతని సేవకులు మిమ్మల్ని చూస్తున్నప్పుడు దాన్ని తీసుకోండి."

"సేవకులు మిమ్మల్ని అనుసరించేలా మీరు నెమ్మదిగా ఎగురుకుంటూ తిరిగి రావాలి .

మీ చెట్టు వద్దకు తిరిగి వెళ్లి, నాగుపాము నివసించే చెట్టు తొర్రలో దాన్ని పడేయండి. సేవకులు నాగుపాముని చూసినప్పుడు దానిని చంపుతారు" అని బదులిచ్చింది .





నక్క చెప్పిన ప్రకారం, ఆ హారాన్ని చెట్టు తొర్ర లో పడవేశాయి .

అక్కడ నల్ల నాగుపాము నిద్రపోతోంది. రాజ సేవకులు గమనించేలా కొమ్మపై కూర్చున్నాయి

రాజ సేవకులు వచ్చినప్పుడు, ఆ శబ్దం ఏమిటో చూడటానికి నల్ల నాగుపాము చెట్టు తొర్రలో నుండి బయటకు వచ్చింది.

నల్ల నాగుపాము చూడగానే సేవకులు హారాన్ని తిరిగి పొందడానికి కర్రలు రాళ్లతో నాగుపాముపై దాడి చేశారు.

వారు దుష్ట నాగుపాముని చంపి, హారంతో తిరిగి తీసుకుని వెళ్ళారు .

కాకులు, నాగుపాము నుండి తప్పించుకుని, సంతోషంగా జీవించాయి.



## కథ



# అందరూ అమాయకులే

పల్లె గ్రామంలో ముసలయ్యకున్న నలుగురు కొడుకులు పుట్టు గుడ్డివాళ్లు. లోకజ్ఞానం లేని అమాయకులు. భార్య చనిపోవడంతో ముసలయ్యే వారి అవుసరాలు తీరుస్తూ జీవనోపాధికి వారి చేత గంపలు తట్టలు తాళ్లు నేయిస్తూ సంతల్లో అమ్మి పోషిస్తున్నాడు.

అమాయక కొడుకులు పెరిగి పెద్దయేసరికి ముసలయ్య కూడా వార్ధక్యంలో చనిపోతే అంధులైన నలుగురుఅన్నదమ్ములు అనాథలయారు.

వారికి ఊరిలో తిండి పెట్టేవారు లేకపోయారు. పట్నానికి పోయి బిచ్చమెత్తుకుని బతకమని ఎవరో చెబితే నలుగురు అన్నదమ్ములు చిన్న చేతికర్రల సాయంతో అడవిలో కాలిబాటన నడుచుకుంటు పట్నానికి బయలుదేరేరు.

కొంతదూరం వచ్చేసరికి దారిలో వారికి ఒకచోట పెద్ద ఏనుగు విప్ప పువ్వులు మస్తుగా తిని మత్తుగా నిద్రపోతోంది. దారిలో పడుకుని ఉన్న ఏనుగును అదేమిటో వారు గుర్తించ లేకపోయారు.

నలుగురు గుడ్డి అన్నదమ్ములు ఏనుగుకు చెరోవైపు వెళ్లి ఒకడు తోక పట్టుకుని చీపురు అన్నాడు.ఇంకొకడు దాని దంతాలు పట్టుకుని వెదురు బొంగులనీ, మరొకడు కాలు పట్టుకుని చెట్టు మొదలు అన్నాడు. చివరివాడు ఏనుగు బాన కడుపును చేత్తో తడిమి రాతిబండ అన్నాడు.

వాళ్ల దినచర్యలో ఎదురయ్యే వస్తువులు పేర్లు చెప్పుకున్నారు. తను చెప్పిందే సరైందని వాళ్లలో వాళ్లు వాగ్వివాదానికి దిగారు.

ఇంతలో అటుగా వచ్చిన ఒక చెవిటివాడు వాళ్లు నలుగురు ఏనుగును అమ్మడానికి సంతకు ఎలా తీసుకెళ్లాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారనుకున్నాడు.

తన గుడిసెలో పెద్ద మోకుతాడు వెదురుతడిక ఉన్నాయని చెప్పి వాటిని ఏనుగు దగ్గరకు తీసుకువచ్చి విషయం వివరించి అంధ అన్నదమ్ముల సాయంతో మోకుతాడును ఏనుగు కడుపుకి కట్టి వెదురు తడిక మీదకు పొర్లించారు.

# కథ

మోకుతాడును అందరూ పట్టుకుని మత్తులో పడుకున్న ఏనుగును కాలిబాట వెంట చెవిటి వాని సాయంతో ముందుకు ఈడ్చుకెల్తున్నారు.

కొంత దూరమెళ్లేసరికి దారిలో వారికి ఒక మూగవాడు ఎదురు పడి చేతి సంజ్ఞతో ఎక్కడి కేళుతున్నారు అని అడిగాడు.

అతని చేతి సంజ్ఞలు చూసిన చెవి టివాడు ఏనుగు ధర ఎంతని అడుగుతున్నాడనుకుని వెయ్యి రూపాయలన్నాడు.

నేనూ సాయం చేస్తానని వాళ్లతో పాటు తాడును పట్టుకున్నాడు గుడ్డి నలుగురు అన్నదమ్ములు ఏనుగును వెనక నుంచి నెట్టుతుంటె, మూగివాడు చెవిటివాడు తాడు పట్టుకుని ఏనుగును ముందుకు లాక్కెళుతున్నారు.

సగం దూర మెళ్లేసరికి వారికి మద్యలో నీటి కాలువ అడ్డు వచ్చింది నీటికాలువ మద్యకు రాగానే నీళ్ల చల్లదనానికి తడిక మీద పడున్న ఏనుగుకి విప్పపువ్వు మత్తు వదిలింది.

కళ్లు విప్పి తన శరీరానికి కట్టిన మోకుతాడును చూసి వేటగాళ్లు బంధించి తీసుకెల్తున్నారని భయపడి ఒక్కసారిగా లేచి నిలబడి ముందున్న చెవిటివాడిని మూగవాడిని తొండంతో విసిరి కొట్టింది.

కళ్లు కనబడని నలుగురు అన్నదమ్ములు ఏనుగు కాళ్లను గట్టిగా పట్టుకున్నారు. ఏనుగుకు కోపం పెరిగి నడుముకు కట్టిన తాడును విదిలించుకుని ఆ నలుగుర్నీ కాళ్లతో కుమ్మేసి అడవిలోకి పారిపోయింది.

అజ్ఞానంతో అందరూ అమాయకంగా వారికున్న అంగ వైకల్యంతో ఒకరి భావం ఇంకొకరు అర్థం చేసుకోలేక ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు.

**-కందర్ప మూర్తి**



## బాల గేయం
## మువ్వన్నెల జెండా

పల్లవి :
ఎగిరింది ఎగిరింది జాతీయజెండా...
మువ్వన్నెల ముచ్చటైన మన దేశ జెండా...
స్వేచ్ఛా వాయువులను పిలుస్తూ...
గగన వీధుల్లో ఘనంగా విహరిస్తూ...!!!

చరణం : 1.
భారతీయుల సమైక్యతను చాటుతూ...
వీరుల ధీరత్వాన్ని ప్రస్ఫుటిస్తూ...
దేశభక్తుల దేశభక్తికి ప్రతీకయై నిలుస్తూ...
అశోకుని చక్ర చిత్ర పటముతో...!

చరణం :2
మహాత్ముని సూచనలతో...
పింగళి వెంకయ్య రూపకల్పనతో...
ముచ్చటైన మూడు రంగులతో...
శాంతి, అహింసలను ప్రేరేపిస్తూ....!


చరణం :3

కాషాయం వర్ణంతో త్యాగనిరతిని తెల్పుతూ...
తెలుపు వర్ణంతో శాంతి, స్వచ్ఛతలను ప్రభోదిస్తూ...
హరిత వర్ణంతో దేశాభివృద్ధికి దీప్తియై నిలుస్తూ...
భిన్నత్వంలో భారతీయుల ఏకత్వానికి చిహ్నమై...!

**-డా. ఆళ్ళ నాగేశ్వరరావు**

# సైన్స్ కథలు ..





## థామస్ ఆల్వా ఎడిసన్

కరెంటు బల్బు ఆవిష్కరించిన ప్రముఖ శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ జీవితంలో ఆయన తల్లి పాత్ర ఎంతో కీలకమైంది. ఎడిసన్ చిన్నతనంలో అయన తల్లి చేసిన ఒక పని వల్ల ఆయన ఒక గొప్ప శాస్త్రవేత్త అయ్యారు . ప్రపంచానికి చీకటి నుంచి వెలుగులోకి తీసుకువచ్చాడు. ఒకవిధంగా చూస్తే ఆయన తల్లి వల్లే ఇదంతా సాధ్యమైంది. వి థామస్ అల్వా ఎడిసన్ పాఠశాలలో చదువుకుంటున్న రోజులు.. ఒక రోజు ఎడిసన్ స్కూలు నుంచి వస్తూ తనతో పాటు ఒక లెటర్ తీసుకువచ్చాడు. దానిని తన తల్లికి ఇచ్చి.. ఇది స్కూలులో తనకు ఇచ్చారని, దానిలో ఏముందో గట్టిగా చదవి వినిపించమన్నాడు. తల్లి ఆ లెటర్‌ను తెరిచి, చదవడం ప్రారంభించింది. ఆ లెటర్ చదువుతున్న ఆమెకు కన్నీళ్లలో మునిగిపోయింది. తన కుమారుడు థామస్‌ను దగ్గరకు తీసుకుని ఏడ్చింది.

అది చూసిన చిన్నారి థామస్.. 'అమ్మా అందులో ఏమి రాశారు?' అని అడిగాడు. అప్పుడు ఆమె ఆ లెటర్‌ను బిగ్గరగా చదవడం ప్రారంభించింది... "మీ కుమారుడు ఒక జీనియస్, థామస్ అద్భుతమైన తెలివితేటలు కలిగినవాడు , అయితే మేము ఇటువంటి కుర్రాడికి మా స్కూలులో చదువు చెప్పలేము, ఇక్కడ థామస్‌కు చదువు చెప్పగల సరైన ఉపాధ్యాయులు లేకపోవడమే దానికి కారణం. అందుకే థామస్‌కు మీరు ఇంట్లోనే చదువు చెప్పండి" అని రాశారు అంటూ ఆమె థామస్‌కు చెప్పింది.

ఆ రోజు నుంచి థామస్ ఇంట్లోనే తన తల్లి వద్ద చదువు నేర్చుకున్నాడు. తల్లి థామస్ చదవు గురించి శ్రద్ద తీసుకొని అతడిని ఒక గొప్ప మేధావిగా తీర్చిదిద్దింది. తరువాతి కాలంలో థామస్ ఎడిసన్ ప్రపంచంలోనే గొప్ప ఆవిష్కర్తగా మారారు. కరెంటు బల్బును కనిపెట్టి 1893లో దానికి పేటెంట్ పొందారు. తరువాత విజయవంతమైన బిజినెస్ మ్యాన్‌గా మారారు. థామస్ విజయపరంపర కొనసాగిస్తున్న సమయంలోనే ఆయన తల్లి కన్నుమూసింది. ఒకరోజు థామస్ తన ఇంట్లోని పాత వస్తువులు తొలగిస్తుండగా.. ఒక లెటర్ కనిపించింది. అది తాను పాఠశాలలో చదువుకుంటున్న రోజుల్లో ఉపాధ్యాయులు తనకు ఇచ్చిన లెటర్.

ఆ లెటర్ చదివిన థామస్‌కు ఒక్కసారిగా షాక్ తగిలింది. అందులో 'మీ కుమారుడు థామస్ మానసికంగా చాలా బలహీనుడు. ఇలాంటి కుర్రాడికి మా స్కూలులో చదువు చెప్పలేం. దయచేసి మీ అబ్బాయికి మీ ఇంట్లోనే చదువు నేర్పండి' అని వుంది. ఈ లెటర్ చదవగానే థామస్ కన్నీళ్లు

# సైన్స్ కథలు ..





ఆపుకోలేకపోయాడు.

అప్పుడు థామస్‌కు.. తన తల్లి పడిన ఆవేదన, తనను ఇంతవాడిని చేయడానికి ఆమె పడిన కష్టం గురించి అర్థమైంది.


ఒకవేళ ఆ లెటర్‌లో ఉన్నది ఉన్నట్లు తన తల్లి చదివివుంటే.. తాను ఇన్ని ఆవిష్కరణలు చేసే అవకాశమే ఉండేదికాదని అనుకుంటూ.. థామస్ తన తల్లికి మనసులోనే కృతజ్ఞతలు తెలిపారు.

థామస్ జీవితంలోని ఈ ఘటన ద్వారా మనం ఒక ముఖ్యమైన విషయం తెలుసుకోవాలి. సాధారణంగా చాలామంది ఎదుటివారి లోపాలను చూసి వారిని కించపరిచి, వారిలోని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంటారు. ఇలా చేయడం వలన వారు మరింత కుంగిపోతారు. దీనికి బదులు లోపాలున్నవారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేయాలి.

థామస్ అల్వా ఎడిసన్ ( 1847, ఫిబ్రవరి 11 – 1931 అక్టోబర్ 18) మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను రూపొందించిన ఒక గొప్ప అమెరికన్ శాస్త్రవేత్త, వ్యాపారవేత్త.

అతను 1000 పేటెంట్లకు హక్కులు కలిగి ఉన్నాడు. 1889లో పారిస్లో గొప్ప వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. అందులో ప్రదర్శించబడ్డ వస్తువుల్లో తొంభై శాతానికి పైగా థామస్ ఎడిసన్ కు చెందినవే. 1862 లో ఎడిసన్ ఒక స్టేషను మాష్టర్ బిడ్డను ప్రమాదం నుంచి రక్షించి అందుకు ప్రతిఫలంగా ఆయన వద్ద నుంచి టెలీగ్రఫీని నేర్చుకున్నాడు. 1868 లో టెలిగ్రాఫ్ పేటెంట్ ను పొందగలిగాడు. బతుకు తెరువు కోసం స్టాక్ ఎక్స్ఛేంజీ టెలిగ్రాఫ్ ఏజన్సీలో పనికి కుదిరాడు. తన టెలిగ్రాఫ్ పరికరాన్ని అమ్ముకున్నాడు. ఏ కొద్ది మొత్తమో లభిస్తుందని అనుకున్న ఎడిసన్ కి నలభై వేల డాలర్లు ముట్టడంతో ఆశ్చర్యపోయాడు. అంతే, అప్పటి నుండి ఆయన ఆవిష్కరణలకు అంతం లేకుండా పోయింది. 1878 లో ఎలక్ట్రిక్ బల్బ్ ను రూపొందించాడు. అది ఆర్థికంగా ఆయనకు మరింత ఎత్తుకు తీసుకుని వెళ్ళింది. థర్మో అయానిక్ ఎమిషన్ గురించి కూడా అదే సమయంలో ఎడిసన్ వెల్లడించాడు. 1887–1889 మధ్య కాలంలో టైప్ రైటర్, ఎలక్ట్రిక్ పెన్, గ్రామ్ ఫోన్, మోషన్ పిక్చర్ కెమేరా, అలాగ ఎన్నింటినో ఇతను రూపొందించాడు. 1931 న చనిపోయే నాటి వరకు సరికొత్త ఆవిష్కరణలు కోసం అనుక్షణం ఆరాట పడ్డాడు.

★★★★





# నీతి చంద్రిక కథలు



## పులి కంకణం బాటసారి



ఆచార్య ఇరపని మాధవి

విష్ణుశర్మ మిత్ర భేదం,మిత్ర సంప్రాప్తి, కాకోలూకీయం,లబ్ధ ప్రకాశం, అపరీక్షితకారిత్వం అనే ఐదు తంత్రాలతో కూడిన పంచతంత్రాన్ని సంస్కృతంలో రాశారు. దానిని తెలుగులోకి పరవస్తు చిన్నయసూరి, కందుకూరి వీరేశలింగం నీతి చంద్రిక అనే పేరుతో అనువదించారు. నీతి చంద్రికలోని మిత్రలాభం, మిత్రభేదాలను చిన్నయసూరి; విగ్రహం,సంధులను వీరేశలింగం పంతులుగారు రాశారు. ఈ నీతి చంద్రికలో నీతిని నేరుగా చెప్పక కథల రూపంలో చెప్పిన కారణంగా అవి చెక్కుచెదరక పిల్లల మనసులో ఉండిపోతాయి. ఈ కథలలో పశు పక్ష్యాదులే పాత్రలు కాబట్టి పిల్లలు ఇష్టంగా చదువుతారు.

గంగాతీరంలో పాటలీపుత్రానికి రాజు సుదర్శనుడు. అతడి కుమారులను విద్యావంతులను, నీతిమంతులను చేయటం కొరకు విష్ణుశర్మ చెప్పిన కథలే ఈ కథలు.

పులి–కంకణం– బాటసారి

ఒక ముసలిపులి స్నానం చేసి, దర్భలు చేతిలో పట్టుకొని ఒక కొలను పక్క కూర్చొని ఆ దారిలో ప్రయాణించే బాటసారులతో ‘ ఓ బాటసారి ఈ బంగారు కంకణం తీసుకో అని చెబుతూ ఉంది. అది విని ఒక బాటసారి నా అదృష్టం కొద్దీ ఈ అవకాశం వచ్చింది, ఎందుకు సందేహించాలని ‘ఏదీ బంగారు కంకణం చూపించు ‘ అని అడిగాడు. పులి బంగారు కంకణం చూపించింది. బాటసారి ‘నువ్వు క్రూర జంతువ్వి. నిన్నెలా నమ్మచ్చు’ అన్నాడు. దానికి పులి ‘ నేను యౌవనంలో ఉన్నప్పుడు ఎంతో చెడ్డవాడినై మనుష్యులను, ఆవులను చంపితిన్నాను. దానితో నాకు పాపం అంటుకుంది. నా భార్యాబిడ్డలను పోగొట్టుకున్నాను. అప్పుడు ఒక పుణ్యాత్ముడు ఇంక ఆవులను, మనుష్యులను తినవద్దని

# నీతి చంద్రిక కథలు



చెప్పాడు. ఇంకా మంచి పనులు కూడా చెయ్యమన్నాడు. అప్పటి నుంచి పాపపు పనులు చేయటం మాని మంచి పనులు చేస్తున్నాను. నేను ముసలివాడిని, నోటిలో పళ్లు, చేతి గోళ్లు ఊడిపోయాయి. లేవటానికి కూడా ఓపిక లేదు. నీవు పేదవాడివని ఈ కంకణం నీకు ఇవ్వాలనుకున్నాను. అనుమానించకుండా ఈ చెరువులో దిగి స్నానం చేసి ఈ కంకణం తీసుకో' అని చెప్పింది.


దాని మాటలు నమ్మి బాటసారి దురాశకు పోయి చెరువులో స్నానం చేయాలని వెళ్లి బురదలో దిగబడ్డాడు. అప్పుడు ఆ పులి ' అయ్యో! బురదలో దిగబడ్డావా, భయపడకు, నేను వచ్చి బురద నుంచి నిన్ను బయటకు తీస్తాను' అంటూ ఆ బాటసారి దగ్గరకు వెళ్లి అతడిని పట్టుకుని, చంపి తినేసింది . ఆ బాటసారి దాని పట్టులో చిక్కి క్రూర జంతువులను నమ్మకూడదు. నమ్మి ఈ గతి తెచ్చుకున్నాను, ఇప్పుడు బాధపడి లాభమేముందనుకుంటూ ఆ పులి చేత చంపబడ్డాడు.

అందుకే ఆశకు లోనై అన్ని విధాలుగా ఆలోచించకుండా ఏ పని చెయ్యకూడదు. మనది కాని వస్తువుకు ఆశ పడకూడదు.

నీతి :చెడ్డవారిని వారి మాటలు విని నమ్మకూడదు.

**-ఆచార్య ఇరపని మాధవి**

# రాము - రోబో







అనగనగా రాము అనే ఒక మంచి పిల్లవాడు ఉండేవాడు .

అతను చక్కగా చదువుకుంటున్నాడని , రాము అమ్మా నాన్న అతనికి ఓ రోబోట్ ని కొని ఇచ్చారు .

రాము దానికి రోబో అని పేరు పెట్టాడు .రోబో తో కొద్ది కాలంలోనే బాగా స్నేహం కుదిరింది రాము కి .

రోబో కూడా రాముకి అన్ని విధాలుగా సహాయం చెయ్య సాగింది.

# రోబో కథలు






రాము తను చెయ్యాల్సిన పనులన్నీ రోబో చేత చేయించటం మూడలుపెట్టాడు .

స్కూల్ పుస్తకాలకు అట్టలు వెయ్యటం , స్కూల్ బాగ్ తీసుకురావటం , తన బూట్లు పాలిష్ చేయించటం ఇలా అన్ని పనులు రోబో నే చెయ్యసాగింది

చివరకు హోం వర్క్ కూడా రోబో చేతనే చేయించేవాడు రాము . రోబో నే ప్రశ్నలు అన్ని చదివి సమాధానాలు రాసేది .

రాము కి ఇప్పుడు ఏ పని లేదు , చదువుకుడా చదవకుండా హాయిగా ఆడుకోసాగాడు .






చివరకు స్కూల్లో పబ్లిక్ పరీక్షల్లో రోబోని అనుమతించక పోవటం తో , రాము పరీక్షలు సరిగా రాయలేక , అన్ని టిలో ఫెయిల్ అయ్యాడు .

కాబట్టి చిన్నారులు ఇంకొకరి చేత మీ పనులు చేయిస్తే మీరు అసమర్థులుగా మారతారని తెలుసుకోండి .



# విక్రమార్క భేతాళ కథలు

ఉజ్జయిని మహారాజు విక్రమార్కుడు తెలివైన వాడని, అనుభవగ్నుడని, అసమాన విజ్ఞాన విచక్షణ గల వాడని పేరు పొందాడు. ఆయన రాజనీతి, యుక్తి, సమస్యస్ఫూర్తి మూలంగా ఆ యుగంలో బాగా ప్రఖ్యాతి చందారు.

విక్రమార్కుడికి రోజు ఒక యాచకుడు ఒక పండు పంపించేవాడట. ఆ పండు కొస్తే, అందులో రోజూ ఒక మణి వుండేది. ఈ విషయం ఆశ్చర్యజనకంగా అనిపించి రాజుగారు ఆ యాచకుడిని కలవాలనుకున్నారు.

యాచకుడు నెలలో 14వ రోజున అర్ధరాత్రి ఒక స్మశానంలో ఒంటరిగా వస్తే కలుస్తానని కబురు పంపించాడు. ఈ వింత ఏంటో తనే తెలుసుకోవాలని విక్రమార్కుడు యాచకుడిని కలిసాడు. ఆ యాచకుడు ఒక చెట్టుమీద వేళ్ళాడుతున్న ఒక శవాన్ని తీసుకుని రమ్మని, ఇలా చేస్తే యాచకుడికి అపారమైన క్షుద్ర శక్తి వస్తుందని యాచించాడు. వెతికి తీసుకుని వస్తానని మాట ఇచ్చాడు విక్రమార్కుడు.

అలా చెట్టుమీంచి దింపిన శవంలో బేతాళుడు వున్నాడు. బేతాళుడు విక్రమార్కుడితో ప్రయాణం చేయడానికి ఒప్పుకుంటాడు కాని, ఒక్క నిబంధన పెడతాడు. దారిలో విక్రమార్కుడు మాట్లాడ కూడదు. దీనికి విక్రమార్కుడు ఒప్పుకుంటాడు.

ఇలా తీసుకుని వెళ్తుంటే బేతాళుడు చిన్న కథ చెప్పి, అందులో ఒక క్లిష్టమైన ప్రశ్న అడుగుతాడు. దానికి జవాబు తెలిసినా నోరు మెదలకపోతే విక్రమార్కుడి తల బద్దలైపోతుందని హెచ్చరిస్తాడు. విక్రమార్కుడు జవాబు చెప్తే బేతాళుడు మౌనభంగం కలిగినందుకు శిక్షగా మళ్ళీ తన చెట్టు మీదకి యెగిరి వెళ్లి పోతాడు. అలాగని చెప్పకపోతే తల నరికేస్తాడు. ఇలాంటి పరిస్థితిలో ప్రతి సారి విక్రమార్కుడు జవాబు చెప్తాడు, బేతాళుడు శవంతో పాటు యెగిరి పోతాడు.

# భేతాళ కథలు



## మారిన నిర్ణయం

పట్టు వదలని విక్రమార్కుడు చెట్టువద్దకు తిరిగి వెళ్ళి, చెట్టుపై నుంచి శవాన్ని దించి భుజాన వేసుకుని, ఎప్పటిలాగే మౌనంగా శ్మశానం కేసి బయలుదేరాడు. అప్పుడు శవంలోని బేతాళుడు, "రాజా, ఇలా అర్థరాత్రి, అపరాత్రి వేళల్లో శ్మశానాల వెంట ఎంతకాలమని తిరుగుతావు? ఒక్కొక్కసారి మనిషి తన నిర్ణయాలను మార్చుకోవడంవల్ల మేలు కలగవచ్చు. నాగరాజు లాంటి పట్టుదలగల యువకుడు, ఆఖరి క్షణంలో తన నిర్ణయం మార్చుకున్నాడు. నీకు అతని కథ చెబుతాను, శ్రమ తెలియకుండా విను" అంటూ ఇలా చెప్పసాగాడు.

నాగరాజు అనే యువకుడికి నగరంలో మంచి ఉద్యోగం వున్నది. అతనికి ఇంకా పెళ్ళి కాలేదు. అతని తల్లిదండ్రులకు నాగరాజు మేనమామ కూతురయిన రత్నాన్ని కోడలుగా తెచ్చుకోవాలని కోరిక. ఆమెకు అంతగా చదువు లేదు. అంత అందగత్తె కూడా కాదు. ఆమెకు నాగరాజు అంటే అమితమైన ప్రేమ. అయితే, ఏ ప్రత్యేకతలు లేని రత్నాన్ని పెళ్ళి చేసుకోవడం నాగరాజుకు ఇష్టం లేదు. ఒకసారి నాగరాజు ఏదో పండగకు సొంత వూరు వచ్చాడు. తల్లిదండ్రులు అతనితో "పనిలో పనిగా రత్నాన్ని పెళ్ళి చేసుకొని వెంటబెట్టుకుపో" అన్నారు.

నాగరాజు సూటిగా జవాబివ్వకుండా అసలు విషయాన్ని దాటవేశాడు.

ఆ సాయంత్రం నాగరాజు ఊరికి దూరంగా ఉన్న మామిడి తోపుల్లోకి షికారు వెళ్ళాడు. సూర్యాస్తమయ సమయంలో వర్షం ప్రారంభమైంది. అతను కొంతదూరం పరిగెత్తి, ఒకపెంకుటింటి అరుగుమీద తలదాచుకున్నాడు. అయితే ఆ సరికే అతను బాగా తడిసిపోయాడు. "అయ్యో, బాగా తడిసిపోయావు. లోపలికిరా, బాబూ" అంటూ కిటికీలోంచి అతణ్ణి చూసిన ఒక ముసలావిడ తలుపు తెరిచింది.

నాగరాజు మొహమాటపడుతూనే లోపలికి వెళ్ళాడు.

"సంధ్యా, పొడిగుడ్డ తీసుకు రామ్మా. ఈయన వర్షంలో బాగా తడిసిపోయాడు" అని ముసలావిడ లోపలికి కేక పెట్టింది.

"అందమైన పేరు!" అనుకున్నాడు నాగరాజు.

ఇంతలో కాళ్ళ గజ్జెల గలగల శ్రావ్యంగా వినిపించి గుమ్మం దగ్గరే ఆగిపోయింది. ముసలావిడ గుమ్మందాకా వెళ్ళి, బట్ట అందుకున్నది.

నాగరాజు తడిసిన తల తుడుచుకుంటుండగా "కాసిని వేడిపాలు పట్టుకురా సంధ్యా" అని మళ్ళీ కేకపెట్టింది ముసలావిడ.

తరవాత ఆమె నాగరాజును గురించి తెలుసుకున్నది; తమను గురించి చెప్పింది; వాళ్ళు ఆ వూరుకు కొత్తగా వచ్చారు.

కౌలుకు యిచ్చిన పొలం సొంతంగా చేసుకుంటున్నారు. ఆమెకు సంధ్య ఒక్కతే కూతురు, ముసలావిడ భర్త చాలా కాలం కిందటే పోయాడు.

సంధ్యను చూడాలని నాగరాజుకు చాలా కోరికగా ఉన్నది. కాని, పాలు కూడా గుమ్మందాకా వెళ్ళి ముసలావిడే అందుకోవడంతో, అతడికి ఆ అవకాశం చిక్కలేదు.

మర్నాడు పని గట్టుకుని ఆ ఇంటివైపుకు వెళ్ళాడు నాగరాజు. ముసలావిడ కిటికీలకు కొత్తగా అల్లిన తెరలు కడుతున్నది. ఆమె నాగరాజును నవ్వుతూ ఆహ్వానించి, "మా సంధ్య తోచనప్పుడు యిలా తెరలూ అవీ అల్లుతూ వుంటుంది" అన్నది.

ఆ పూట అతనికి సంధ్య చేసిన రుచికరమయిన ఫలహారం అందింది కాని, ఆమె దర్శనం మాత్రం కాలేదు.

ఆ మర్నాడు తమ దొడ్లో కాసిన రెండు దానిమ్మపళ్ళు తీసుకొని, నాగరాజు, సంధ్య వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. వీధి తలుపు మూసి ఉన్నది. లోపలినుంచి శ్రావ్యమైన పాట వినిపిస్తున్నది. నాగరాజు తీయని ఆ పాట వినడంలో లీనమైపోయాడు. అప్పుడే గుడినుంచి వచ్చిన ముసలావిడను అతడు గమనించలేదు.

# భేతాళ కథలు



ముసలావిడ దగ్గరగా చేరవేసి ఉన్న తలుపు తోస్తూ "ఇప్పుడే వచ్చావా బాబూ? మా సంధ్య పాట మొదలుపెడితే, పరిసరాలు మరచిపోతుంది" అన్నది.

లోపలి గదిలో వున్న సంధ్య, నాగరాజుకు కనపడలేదు. అతడు దానిమ్మపళ్ళను ముసలావిడ చేతిలో పెట్టి, కాసేపు కబుర్లు చెప్పి, ఇంటికి వచ్చేశాడు. అతడికి సంధ్య అన్ని విధాలా తగిన భార్య అనిపించింది. ఆమె పెద్దగా అందంగా లేకపోయినా,ఆమెనే పెళ్ళాడాలన్న దృఢనిశ్చయానికి వచ్చాడు. మర్నాడు ఎలాగయినా సంధ్యను చూడాలనీ, ముసలావిడకు తన అభిప్రాయం చెప్పాలనీ నిశ్చయించుకున్నాడు.

నాగరాజు ఆ మరుసటిరోజున సంధ్యవాళ్ళ ఇంటిని సమీపిస్తుండగా, హఠాత్తుగా పక్క సందులోంచి వచ్చిన ఎద్దొకటి, అతణ్ణి పొడిచి పారిపోయింది.

నాగరాజు కిందపడిపోయాడు. అతడి చేతికి గాయమై రక్తం కారసాగింది. ఈ అలికిడికి ముసలావిడ ఇంట్లోంచి బయిటికి

వచ్చింది. ఆమె నాగరాజును చూసి "అయ్యో ఏం జరిగింది? చేతినుంచి రక్తం కారుతున్నది, లోపలికి రా" అని ఆందోళనపడుతూ వచ్చి, గాయపడిన నాగరాజు చేయి పట్టుకున్నది.

"మీతో ఒక ముఖ్య విషయం చెప్పాలని వస్తున్నాను. ఆ ఆలోచనలో పక్క సందులోనుంచి పరిగెత్తుకొస్తున్న ఎద్దును చూడలేదు" అన్నాడు నాగరాజు.

ముసలావిడ నాగరాజును ఇంట్లోకి తీసుకుపోయి కూర్చోబెట్టి, "సంధ్యా, చెంబుతో నీళ్ళు పట్టుకురా" అని గట్టిగా కేకపెట్టింది.

నడవాగది కిటికీవద్ద నిలబడి సంధ్య ఇదంతా చూస్తూనే ఉన్నది. ఆమె ముఖకవళికల్లో జాలి, ఆదుర్దాలాంటి లక్షణాలే లేవు. తీరా తల్లి కేక వేసాక ఆమె కిటికీ దగ్గరనుంచి కదలి, కొంచెం సేపట్లో నీళ్ళ చెంబు తీసుకుని నాగరాజు ఉన్న చోటుకు వచ్చింది.

ఆమె అందం చూసి నాగరాజు కళ్ళు చెదిరిపోయాయి. అతను అంతటి సౌందర్యవతిని నగరంలో కూడా చూసి ఉండలేదు. ముసలావిడ సంధ్య తెచ్చిన నీళ్ళతో, నాగరాజు గాయం కడిగింది. ఆ తరవాత పసుపూ, శుభ్రమైన గుడ్డా తెమ్మని చెప్పింది.

సంధ్య పసుపూ, గుడ్డా తెచ్చి తల్లికి ఇచ్చి లోపలికి వెళ్ళిపోయింది. ముసలావిడ నాగరాజు గాయానికి కట్టుకట్టింది. అతడు కాస్త తేరుకున్నాక, "ఇప్పుడు చెప్పు బాబూ! నువు చెప్పాలనుకుంటున్న ముఖ్య విషయం ఏమిటి?" అని అడిగింది.

వెంటనే నాగరాజు " మా మేనమామ కూతురితో నా పెళ్ళి జరగబోతున్నది. మీరూ, సంధ్య తప్పకుండా రావాలి" అని చెప్పి ఇంటికి వచ్చేశాడు.

బేతాళుడు యీ కథ చెప్పి "రాజా నాకొక సందేహం! నాగరాజు సంధ్యను చూడకముందే ప్రేమించాడు కదా. ఆమె అతి సాధారణంగా ఉన్నా కూడా ఆమెనే పెళ్ళాడాలని నిర్ణయించుకున్నాడు. అయినా ఆఖరిక్షణంలో తన నిర్ణయాన్ని ఎందుకు మార్చుకున్నాడు? అంత గొప్ప సౌందర్యవతికి తాను తగననుకున్నాడా? ఈ సందేహాలకు సమాధానం తెలిసి కూడా చెప్పకపోయావో, నీ తల పగులుతుంది" అన్నాడు.

దానికి విక్రమార్కుడు "నాగరాజు తన నిర్ణయాన్ని మార్చుకోవడం సరి అయినదే. ప్రతిమనిషికీ కనీసమైన కొన్ని మంచి లక్షణాలుండాలి. అవి లోపించినపుడు, ఇతర అర్హతలు ఎన్ని వున్నా ప్రయోజనం లేదు. పౌరుషం, ఆత్మాభిమానం, ధైర్యం వంటివి మగవాడికుండవలసిన కనీస లక్షణాలు. అలాగే స్త్రీకి కరుణ, ఆదరణ, సేవాధర్మం వంటి లక్షణాలు తప్పకుండా వుండాలి. ఆ గుణాలు లేని స్త్రీ భార్యగా, తల్లిగా తన బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేదు. సంధ్య నాగరాజు గాయాన్నీ, స్రవిస్తున్న రక్తాన్ని చూసి కూడా ఏ మాత్రం చలించలేదు. తోటి మనిషిగా సానుభూతి కనబరచలేదు. ఆమెది రాతి గుండె అని యీ విషయం రుజువు చేస్తున్నది. అందుకే అన్ని అర్హతలున్న అందాలరాశిని కాక, కనీసార్హతలయిన ప్రేమ, అభిమానం ఉన్న మేనమామ కూతురిని పెళ్ళాడడానికి నాగరాజు నిర్ణయించుకున్నాడు" అన్నాడు

రాజుకు ఈవిధంగా మౌనభంగం కలగగానే, బేతాళుడు శవంతో సహా మాయమై తిరిగి చెట్టెక్కాడు.

(చందమామ నుంచి )


# చూపించాల్సిన సినిమా



ఇవాల్టి రోజున ఎటువంటి సినిమాలు వస్తున్నాయో అందరికి తెలిసిందే , వాటి వాటిని చూసి పిల్లలు ఏమి నేర్చుకుంటున్నారో కూడా అందరికి తెలుసు . సినిమా చెడ్డది కాదు .మంచి సినిమా పిల్లలకు చూపిస్తే దానివల్ల ఎంతో ప్రయోజనం కుడా ఉంటుంది . అందుకే ఇక్కడ మంచి సినిమాలను పరిచయం చేస్తున్నాము .

గాంధీజీ శతాబ్ది జన్మదిన వేడుకల సమయంలో, పలువురు నాయకులు & సామాజిక సంస్కర్తలు గాంధీ సిద్ధాంతాలకు సంబంధించి సందేశాలను ఇస్తారు. కానీ నిజ జీవితంలో వాళ్ళే వాటిని పాటించరు. ఈ ద్వంద్వ నీతితో విసుగు చెందిన 9 మంది యువకులు ఒక సంస్థగా ఏర్పడి దేశవ్యాప్తంగా పిల్లలను అపహరిస్తూంటారు. వారు అసూయ, శత్రుత్వం, కులం కుళ్ళూ లేని మరోప్రపంచం అనే ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టిస్తారు. భారత దేవత (జమునా) కూడా ఈ స్థలంలో అడుగుపెడుతుంది. అటువంటి స్థలం ఉనికి దేశంలో తీవ్ర కలకలం రేపుతుంది, ఈ కేసును పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సిబిఐ అధికారి రవీంద్ర నాథ్ (అక్కినేని నాగేశ్వరరావు) ను నియమిస్తుంది.

రవీంద్ర చివరికి వివిధ ఎదురుదెబ్బల తరువాత ఆ మరోప్రపంచాన్ని కనుగొంటాడు. అతను భక్తి, సత్యం, శాంతి, కరుణ, దయతో నిండిన స్థలాన్ని కనుగొంటాడు. దీని నుండి ప్రేరణ పొందిన అతను "మరోప్రపంచాన్ని" సృష్టించిన సంస్థలో చేరాలని నిర్ణయించుకుంటాడు. చట్టం కొంతమంది సభ్యులను పట్టుకుని విచారించినప్పుడు, రవీంద్ర వచ్చి న్యాయవ్యవస్థను మరో ప్రపంచానికి తీసుకువెళతాడు. దాని ప్రత్యేకతను, వారు ఏం సాధించడానికి ప్రయత్నిస్తున్నారో వారికి వివరిస్తాడు. అయినప్పటికీ, న్యాయవ్యవస్థ చలించదు. వారిని దోషులుగానే తీర్పు ఇస్తుంది. పట్టుబడిన వ్యక్తులతో పాటు రవీంద్రకూ శిక్ష పడుతుంది. ఆ తరువాత, పిల్లలు పోలీసులను అడ్డుపడి తమ నాయకులను విడిపించాలని డిమాండ్ చేస్తారు. వారంతా ఇప్పుడు స్వతంత్రులేననీ వారే స్వంతంగా తమపని కొనసాగించగలరనీ రవీంద్ర వారికి వివరిస్తాడు. మొత్తం దేశాన్ని వేరే ప్రపంచంగా మార్చమని వారిని ఆదేశిస్తాడు. పిల్లలు మరో ప్రపంచం వైపు వెళ్లడంతో సినిమా ముగుస్తుంది.




మరోప్రపంచం 1970 లో వచ్చిన సందేశాత్మక తెలుగు చిత్రం. దీనిని చక్రవర్తి చిత్ర నిర్మాణ సంస్థ పై అక్కినేని నాగేశ్వరరావు, ఆదుర్తి సుబ్బారావు నిర్మించారు. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వం వహించాడు. అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి, జమున ప్రధాన పాత్రలలో నటించారు. కెవి మహదేవన్ సంగీతం అందించాడు

# వండర్ కిడ్స్




## వండర్ కిడ్స్

నాలుగేళ్ల పిల్లలు అల్లరితో, ఆటలతో కాలం గడుపుతారు. అయితే జమ్మూ కశ్మీర్ రాష్ట్రం గంగయల్ ప్రాంతానికి చెందిన నాలుగేళ్ల సిద్ధార్థ్ మాత్రం రికార్డులతో అదుర్స్ అనిపించుకుంటున్నాడు. అంత చిన్న వయసులో అతను సాధించిన రికార్డులు చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.

సిద్ధార్థ్ తల్లిదండ్రులు శివ్ జ్యోతి పాండే, శ్వేత పాండే వైద్యులు. చిన్నప్పటి నుంచి పిల్లాడికి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ పెంచారు. దీంతో రెండేళ్ల వయసుకే ఇంగ్లిష్ అక్షరాలన్నీ నేర్చేసుకున్న సిద్ధార్థ్ 12 సెకండ్లలో వాటిని అప్పజెప్పి ‘అతి చిన్న వయసులో, అత్యంత తొందరగా ఇంగ్లీషు అక్షరమాల అప్పజెప్పిన వ్యక్తి’గా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు దక్కించుకున్నాడు. మూడేళ్ల వయసులో భారత జాతీయ చిహ్నాలు, వివిధ రకాల కరెన్సీ నోట్లను గుర్తించి మరోసారి రికార్డు సాధించాడు. ఆ వయసులోనే ఎన్నో పద్యాలు, సంస్కృత శ్లోకాలు చెప్పి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఇతర దేశాల పేర్లు, వాటి జెండాలు, కరెన్సీ వంటి అంశాలను సైతం మూడేళ్లకే గుర్తించడం మొదలుపెట్టాడు. ఎన్నో మున్ముందు మరెన్నో రికార్డులు నెలకొల్పాలని సిద్ధార్థ్ ఉవ్విళ్లూరుతున్నాడు.



# అభిమన్యుడు

ఆది పర్వంలోని సంభవ పర్వంలో అభిమన్యుని పుట్టుక, అతని అకాల మరణం వెనుక ఉన్న కారణం గూర్చి ఉంది. ఒకసారి దేవతల సమావేశంలో చంద్ర దేవుడు సోముని కుమారుడైన వర్చస్సు, అభిమన్యుని యొక్క భూసంబంధమైన రూపాన్ని తీసుకుంటాడని, దుష్టుల వినాశనంలో సహాయం చేస్తాడని ప్రతిపాదించబడింది. తన కొడుకును వదులుకోవడానికి ఇష్టపడని సోముడు, అతను (అభిమన్యుగా) పదహారేళ్ల తర్వాత వర్చస్సుగా తన వద్దకు తిరిగి వస్తాడనే షరతుపై మాత్రమే వారి ప్రతిపాదనకు అంగీకరించాడు.

అభిమన్యుడు పాండవ సోదరులలో మూడవవాడు అయిన అర్జునుడు-యదు వంశానికి చెందిన అతని భార్య సుభద్రకు జన్మించాడు. పాండవులు తమ రాజ్యాన్ని వదులుకొని, వారి బంధువు దుర్యోధనుడిచే పదమూడు సంవత్సరాలు బహిష్కరించబడటానికి ముందు అర్జునుడు అతనికి మొదట సైనిక విద్యను బోధించాడు. ఈ సమయంలో, సుభద్ర తన సోదరుడి ఇంటి అయిన ద్వారక రాజ్యంలో ఉండి, తన కుటుంబ సహాయంతో అభిమన్యుని పెంచింది. అభిమన్యుడు తన మేనమామలు బలరాముడు, కృష్ణుడి నుండి అలాగే అతని తల్లి బంధువు ప్రద్యుమ్నుడి నుండి సైనిక విద్యను అభ్యసించాడు. పాండవులు అజ్ఞాతవాసం నుండి తిరిగి వచ్చినప్పుడు, దుర్యోధనుడు వారి రాజ్యాన్ని తిరిగి ఇవ్వడానికి నిరాకరించాడు, ఇది చివరికి కురుక్షేత్ర యుద్ధానికి దారితీసింది.

చక్రవ్యూహాన్ని ఛేదించే వ్యూహాన్ని అర్జునుడు అభిమన్యుకి బోధించాడు, ఇది అనేక రక్షణ గోడల చిక్కైన ఒక బలీయమైన సైనిక నిర్మాణం. యుధిష్ఠిరుని ప్రకారం ఈ నైపుణ్యం తెలిసిన నలుగురు యోధులలో అభిమన్యుడు ఒకడు . మహాభారతంతో సంబంధం లేని, ఒక జానపద కథ అభిమన్యుడు తన తల్లి గర్భంలో ఉన్నప్పుడే అర్జునుడి నుండి ఈ సమాచారాన్ని తెలుసుకున్నాడు. అయినప్పటికీ, చక్రవ్యూహం నుండి ఎలా నిష్క్రమించాలో అతను వినలేకపోయాడు. ఈ అసంపూర్ణ జ్ఞానం తరువాత అతని మరణానికి దోహదపడింది.

అభిమన్యు వివాహం మహాభారతం లోని నాల్గవ పర్వమైన విరాట పర్వంలో వివరించబడింది. పాండవులు రహస్యంగా జీవించవలసి వచ్చింది. వారి వనవాసం యొక్క చివరి సంవత్సరంలో కనుగొనబడకుండా ఉండవలసి వచ్చింది. పాండవులు మత్స్య రాజ్యంలో మారువేషంలో ఉండి దాని పాలకుడైన విరాటుడిని సేవించారు. రాజు


# ధారావాహిక



కుమార్తె ఉత్తరకు బృహన్నల అనే నపుంసకుడిలా నటించిన అర్జునుడు నాట్యం, సంగీతం నేర్పించాడు. ఒక సంవత్సరం పాటు అజ్ఞాతవాసం ముగిసినప్పుడు, పాండవుల నిజమైన గుర్తింపులు వెల్లడి అయినప్పుడు, విరాటుడు అర్జునుని ఉత్తరను వివాహం చేసుకోమని కోరాడు. అయితే, ఆ సమయంలో అర్జునుడు ఆమెకు గురువుగా పనిచేసినందున తిరస్కరించాడు. బదులుగా, అతను ఉత్తర, అభిమన్యుడు వివాహం చేసుకోవాలనే ఆలోచనను ముందుకు తెచ్చాడు. ఉపప్లవ్య నగరంలో వివాహ వేడుక ఘనంగా జరిగింది అభిమన్యుడు మరణానికి ముందు తన భార్య గర్భవతి. ఆమె తరువాత పరీక్షిత్తు అనే కొడుకుకు జన్మనిచ్చింది. కురుక్షేత్ర యుద్ధంలో పాండవుల విజయం తరువాత, పరీక్షిత్తుడు యుధిష్ఠిరునికి వారసుడు అయ్యాడు. తరువాత యుధిష్ఠిరుని స్థానంలో హస్తినాపుర పాలకుడిగా ఉంటాడు.

మహాభారతం ఉత్తరను అభిమన్యుని ఏకైక భార్యగా పేర్కొనగా, తెలుగు జానపద కథ శశిరేఖా పరిణయం ప్రకారం, అభిమన్యుడు ఉత్తరను వివాహం చేసుకునే ముందు, తన మామ బలరాముడి కుమార్తె శశిరేఖను (వత్సల అని కూడా పిలుస్తారు) వివాహం చేసుకున్నాడు. కథ ప్రకారం, అభిమన్యుడు ద్వారకలో ఉంటూ శశిరేఖతో ప్రేమలో పడ్డాడు, అయితే బలరాముడు దుర్యోధనుడి కుమారుడైన లక్ష్మణుడిని వివాహం చేసుకోవాలనుకున్నాడు. తన కోడలికి సాయం చేయాలనుకున్న భీముడి కొడుకు ఘటోత్కచ శశిరేఖ వేషం వేసి లక్ష్మణుడి చేయి విరిచాడు. ఈ సంఘటన ఫలితంగా, లక్ష్మణుడు శశిరేఖతో తన వివాహాన్ని ముగించాడు. అసలు శశిరేఖ, అభిమన్యులు అప్పట్లో అడవిలో పెళ్లి చేసుకున్నారు. మహాభారతంలో అలాంటి కథ లేదు. ఇది కేవలం కల్పితం.

కురుక్షేత్ర యుద్ధంలో అభిమన్యుడు పాండవుల పక్షం వహించాడు. అతను యువకుడే అయినప్పటికీ, అతను పోరాటంలో అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించాడు. మహాభారతం ఐదవ అధ్యాయం ఉద్యోగ పర్వంలో, అభిమన్యుని మొదటి పదకొండు రోజుల సంఘర్షణలో కౌరవ పక్షాన్ని పర్యవేక్షించిన భీష్ముడు 'సైన్య-విభాగాల నాయకుల నాయకుడు'గా వర్గీకరించబడ్డాడు.



మహాభారతం యొక్క భీష్మ పర్వంలో భీష్ముడు కౌరవ దళ సేనాధిపతిగా పనిచేసిన మొదటి పదకొండు రోజుల యుద్ధంలో జరిగిన యుద్ధాల గురించి సమగ్ర కథనాన్ని కలిగి ఉంది. అభిమన్యుడు మొదటి రోజు కోసల రాజు బృహత్బలతో యుద్ధంలో నిమగ్నమయ్యాడు. తరువాత, భీష్ముడితో జరిగిన భయంకరమైన యుద్ధంలో, అభిమన్యుడు భీష్ముడి ధ్వజస్తంభాన్ని విరిచాడు. అతను రెండవ రోజు దుర్యోధనుని కుమారుడు లక్ష్మణుడితో కలిసి యుద్ధంలో నిమగ్నమయ్యాడు. అతను అర్జునుడు నిర్మించిన అర్ధ చంద్ర వ్యూహం అని పిలువబడే అర్ధ వృత్తాకార ఫలకంలో ఒక స్థానాన్ని ఆక్రమించాడు. అతను గాంధారులతో కూడా క్రూరంగా పోరాడాడు. అతను శల్యునిపై దండెత్తినప్పుడు, మగధ రాజు జయత్సేనుడు, అతని ఏనుగును చంపారు. యుద్ధంలో భీముడికి సహాయం చేసిన తరువాత, అభిమన్యుడు మరోసారి లక్ష్మణుడిని ఓడించాడు. అదనంగా, వికర్ణ, చిత్రసేన, ఇతర కౌరవ సోదరులు అభిమన్యు చేతిలో ఓడిపోయారు. తరువాత, అతను పాండవుల సేనాధిపతి ధృష్టద్యుమ్నుడు నిర్మించిన శృంగాటక వ్యూహంలో తన స్థానాన్ని పొందాడు. అభిమన్యుడు అంబష్ఠ, అలంబుష లను కూడా ఓడించాడు. ఆ తర్వాత సుదిష్ఠ, దుర్యోధన, బృహత్బలలతో యుద్ధం చేశాడు

(ఇంకా ఉఇంది )

## ధారావాహిక





# శివాజీ

శివాజీ తండ్రి అయిన షాహాజీ నిజాంషాహీల ప్రతినిధిగా ఉంటూ మొఘల్ రాజులను వ్యతిరేకిస్తూ యుద్ధాల్లో పాల్గొనేవాడు. నిజాంషాహీలపైన షాజహాన్ దండయాత్ర చేసినపుడు షాహాజి సైనికులను బలోపేతం చేయడంలో కీలక పాత్ర వహించాడు. తన ఆదేశాలను ధిక్కరించినందుకు లఖూజీ జాదవ్‌రావ్ అనే మరాఠా యోధుణ్ణి నిజాంషాహీ ప్రభువు హత్య చేయించాడు. ఇది నచ్చని షాహాజీ నిజాంషాహీ ప్రభువు పైన తిరుగుబాటు బావుటా ఎగురవేసి స్వతంత్ర మరాఠా సామ్రాజ్యానికి నాంది పలికాడు.

శివాజీ సా.శ. 1630 ఫిబ్రవరి 19వ సంవత్సరం వైశాఖమాసపు శుక్లపక్ష తదియనాడు పూణే జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర శివనేరి కోటలో షాహాజీ, జిజియాబాయి దంపతులకు జన్మించాడు. వీరు మహారాష్ట్రలోని వ్యవసాయం చేసుకునే భోస్లే కులానికి చందినవారు. శివాజీ తల్లి జిజియాబాయి యాదవ క్షత్రియ వంశమునకు చెందిన ఆడ పడుచు. (దేవగిరి మరాఠా యాదవ రాజుల వంశము). శివాజీకి ముందు పుట్టిన అందరూ మృతి చెందగా ఆమె పూజించే దేవత అయిన శివై పార్వతి పేరు శివాజీకు పెట్టింది.

షాహాజీ నిజాంలను ఓడించి గెలుచుకున్న ప్రాంతాల్లో సామ్రాజ్యాన్ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తుండగా, మొఘలులు ఆదిల్షాతో కలసి షాహాజీని ఓడించారు. ఆదిల్షాతో సంధి ప్రకారం షాహాజి ప్రస్తుత బెంగుళూరు ప్రాంతాన్ని జాగీరుగా పొంది, పూణే వదిలి వెల్లవలసి వచ్చింది. షాహాజీ పూణేలో తనకున్న జాగీరును వదులుకోవలసిన అవసరం లేకుండా ఒప్పందం కుదుర్చుకొన్నాడు.

షాహాజీ పూణేలో తన జాగీరు వ్యవహారాలను తన భార్యకు అప్పగించి యువకుడయిన శివాజీకి రాజనీతి వ్యవహారాలు నేర్పడానికి కొందరు ముఖ్య అనుచరులతో కలసి ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి తాను బెంగుళూరు జాగీరుకు వెళ్ళాడు.శివాజీ తల్లి అతనికి పుట్టిన భూమి పైన, ప్రజల పైన ప్రేమ కలుగునట్లు విద్యాబుద్ధులు నేర్పింది. చిన్నప్పటినుండి భారత రామాయణ బలి చక్రవర్తి గాథలు చెప్పి వీర లక్షణాలు మొలకింప చేసింది. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం తన తల్లివద్దనే నేర్చుకున్నాడు. తన తండ్రి పొందిన పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి

# ధారావాహిక

కాలంలో శివాజీ యుద్ధ తంత్రాలలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యలు తెలుసుకొన్న శివాజీ మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలు మొదలు పెట్టాడు.

1 7 ఏళ్ళ వయసులో శివాజీ మొట్టమొదటి యుద్ధం చేసి బిజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడు. మరో మూడేళ్ళలో కొండన, రాజ్‌ఘడ్ కోటలను సొంతం చేసుకొని పూణే ప్రాంతాన్నంతా తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.

శివాజీ తమ కోటలను సొంత చేసుకోవడం చూసి ఆదిల్షా మోసపూరితంగా శివాజీ తండ్రి అయిన షాహాజీని బందీ చేసాడు. తర్వాత శివాజీని, బెంగుళూరులో ఉన్న శివాజీ అన్న అయిన శంభాజీని పట్టుకోవడానికి రెండు సైన్యాలను పంపగా అన్నదమ్ములిరువురు ఆ సైన్యాలను ఓడించి తమ తండ్రిని బంధ విముక్తుడిని చేయించుకున్నారు. అప్పుడు ఆదిల్షా యుద్ధ భయంకరుడుగా పేరు పొందిన అఫ్జల్ ఖాన్‌ను శివాజీ పైకి యుద్ధానికి పంపించాడు.

శివాజీ మెరుపుదాడులు, గెరిల్లా యుద్ధ పద్ధతులు తెలుసుకొన్న అఫ్జల్ ఖాన్ అతడిని ఓడించడానికి యుద్ధభూమి మాత్రమే ఏకైక మార్గమని తలచి శివాజీని రెచ్చకొట్టడానికి శివాజీ ఇష్ట దైవమయిన భవానీ దేవి దేవాలయాలను కూల్చాడు. ఇది తెలిసిన శివాజీ తాను యుద్ధానికి సిద్ధముగా లేనని చర్చలకు ఆహ్వానించాడు. ప్రతాప్‌ఘడ్ కోట దగ్గర సమావేశమవడానికి ఇద్దరూ అంగీకరించారు.

అఫ్జల్ ఖాన్ సంగతి తెలిసిన శివాజీ ఉక్కు కవచాన్ని ధరించి పిడిబాకు లోపల దాచుకున్నాడు. ఇద్దరూ కేవలం తమ అంగరక్షకులతో గుడారంలోకి వెళ్ళి చర్చలు జరుపుతుండగా అఫ్జల్ ఖాన్ దాచుకున్న కత్తితో శివాజీ పైన దాడి చేసినపుడు ఉక్కు కవచం వల్ల శివాజీ తప్పించుకున్నాడు. అంతలో అడ్డు వచ్చిన అఫ్జల్ ఖాన్ సైనికాధికారులను, శివాజీ సైన్యాధికారులు అడ్డుకోనగా, శివాజీ తన దగ్గరన్న పిడి పులి గోర్లతో అఫ్జల్ ఖాన్ పొట్టను ఉగ్ర లక్ష్మీనరసింహ వలె చీల్చి చెండాడుతాడు. అఫ్జల్ ఖాన్ తప్పించుకొని గుడారం నుండి బయటకు పారిపోతుండగా, ఒకే వేటుకు శివాజీ అఫ్జల్ ఖాన్ తల నరుకుతాడు.



అఫ్జల్ ఖాన్ సేనను శివాజీ సేన దట్టమయిన అడవుల్లో అటకాయించి మెరుపుదాడులతో మట్టికరపించింది. ఈ విజయంతో శివాజీ మరాఠా యోధుడిగా మహారాష్ట్ర అంతా పేరు తెచ్చుకున్నాడు. ఎలాగయినా శివాజీని అణచాలని బీజాపూర్ సుల్తాన్ యుద్ధవీరులుగా పేరు తెచ్చుకున్న ఆఫ్ఘన్ పస్తూన్ సైనికులను పంపించగా, శివాజీ సేన వేల సంఖ్యలో పస్తూన్లను చంపి విజయం సాధించింది. ఈ సంఘటనతో శివాజీ కీర్తి ప్రతిష్ఠలు భారతదేశమంతా వ్యాపించాయి. ఎందరో హిందూ రాజులకు శివాజీ ఆదర్శంగా నిలిచాడు.

(ఇంకా ఉంది )

# ఉపాధ్యాయులకు



## తరగతి గదే ఒక ప్రయోగశాల

మీలో  చాల మంది చక్కగా ప్రయోగ శాలలో  సైన్సు ప్రయోగాలను విద్యార్ధులకు సులభంగా వివరిస్తూ ఉంటారు . వాటిని అక్షరబద్ధం చెయ్యండి . ఒకటి రెండు బొమ్మలు( ఫోటో తీసి ) కలిపి మాకు పమపండి .ఉత్తమమైన ప్రయోగాన్ని ప్రచురించటమే కాక బహుమతి కూడా గెలుచుకొండి .

మీ పేరు :

పాఠశాల చిరునామా :

ప్రయోగం పేరు :

ప్రయోగం వివరణ :



ప్రయోగం బొమ్మలు :

చివరగా ప్రయోగం మీ సొంతమని హామీ పత్రం తప్పనిసరి . ఎదో ఒక బొమ్మలో మీరు ఉండేటట్లు చుడండి .

మీలో  చాల మంది చక్కగా ప్రయోగ శాలలో  సైన్సు ప్రయోగాలను విద్యార్ధులకు సులభంగా వివరిస్తూ ఉంటారు .మీరు కనుక మీ పాఠశాలలో సైన్సు ఎక్సిబిషన్ నిర్వహించే ఉద్దేశ్యం ఉంటె మాకు తెలియ చెయ్యండి . మీకు ప్రోత్సాహం ఇవ్వటమే కాకుండా , మీ ప్రదర్శనకు సంబంధించిన వార్తలను ఫోటోలతో  ఉచితంగా పత్రికలో ప్రచురిస్తాము .

మీ విద్యార్ధులకు  ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహనా లేదా ?అటువంటి కార్యక్రమం నిర్వహించాలని అనుకుంటున్నారా ? అయితే మాకు రాయండి , కృత్రిమ మేధ, రాకెట్ ప్రయోగాలు , బయోటెక్నాలజీ ..ఇలా వివధ రంగాలలో నిష్ణాతులైన వారిచే ఉచితంగా అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తాము .పూర్తిగా ఉచితం ..ఎటువంటి  రుసుము అవసరం లేదు .

# ప్రయోగశాల

బెలూన్ రాకెట్ ప్రయోగం (Balloon Rocket Experiment)

గాలి పీడనం ఏ విధంగా పనిచేస్తుందో ఈ ప్రయోగం ద్వారా తెలుసుకోవచ్చు.

కావలసినవి: బెలూన్, పొడవైన దారం, ప్లాస్టిక్ స్ట్రా (Straw), సెల్లో టేప్.

విధానం:

ఒక పొడవైన దారాన్ని స్ట్రా గుండా ఎక్కించండి.


దారం రెండు చివరలను రెండు కుర్చీలకు లేదా గోడలకు బిగుతుగా కట్టండి.

బెలూన్‌ను గాలితో నింపి, దాని చివరను చేత్తో పట్టుకోండి (ముడి వేయకండి).

ఆ బెలూన్‌ను సెల్లో టేపుతో స్ట్రాకు అతికించండి.

ఇప్పుడు బెలూన్ చివరను వదిలేయండి.

ఫలితం: బెలూన్‌లోని గాలి వెనుకకు వేగంగా బయటకు రావడం వల్ల, బెలూన్ దారంపై ముందుకు దూసుకుపోతుంది. ఇది న్యూటన్ మూడవ నియమానికి (చర్య–ప్రతిచర్య) నిదర్శనం



# బొమ్మకు కథ

ఈ క్రింది బొమ్మకు కథ రాసి పంపండి ఉత్తమమైన కథకు రూ 116 /-బహుమతి పొందండి

నిబంధనలు :

పది సంవత్సరాల పిల్లలకు మాత్రమే

కథ కనీసం ప్రింటులో ఒక పేజి రావాలి

కథ యుని కోడ్ లో టైపు చేసి పంపాలి

చేతి రాత కథలు స్వీకరించబడవు

పంపవలసిన చిరునామా

sumathibalapatrika@gmail.com

ఆఖరు తేది :15-01-2026



# బొమ్మలు వేసి పంపండి

## అంశం :ఆడ పిల్లని ఆదుకుందాం

నిబంధనలు :పది సంవత్సరాల పిల్లలకు మాత్రమే ,A4 సైజు పపెర్ మీద గీసి ఫోటో తీసి పంపండి

తల్లి తండ్రులు , ఉపాధ్యాయులు పిల్లలను పోటీలకు ప్రోత్సహించండి .పోటీలో గెలిచిన వారి ఫోటతో పాటు వారి తల్లి తండ్రుల , ఉపాద్యాయుల వివరాలు కుడా ప్రచురిస్తాము

పంపవలసిన చిరునామా

sumathibalapatrika@gmail.com

ఆఖరు తేది :15-01-2026

# పజిల్:

ఒక పాలవాడి దగ్గర, 4–లీటర్ల జగ్గు 3–లీటర్ల జగ్గు మాత్రమె ఉన్నాయి .సరిగ్గా 2 లీటర్ల నీటిని కొలవడం ఎలా ?


సాధనాలు: 4L జగ్, 3L జగ్, నీటి సరఫరా, నీటిని పారబోసే మార్గం.

నియమాలు: జగ్‌లను నింపడం, ఖాళీ చేయడం, ఒకదాని నుంచి మరొకదానికి పోయడం చేయవచ్చు, కానీ కొలతలు లేవు.

వివరంగా మీ సమాధానం రాయండి .ఉత్తమ సమాధానానికి 116/– బహుమతి పొందండి .

ఆఖరు తేది :15-01-2026

# బొమ్మల కథ



## అల్లాఉద్దీన్ అద్భుత దీపం

అనగనగా అగ్రభా అనే నగరంలోఅల్లావుద్దీన్ అనే అల్లరి కుర్రాడు వుండేవాడు.అతని దగ్గర అబూ అనే కోతి వుండేది ఇద్దరు ఏ పని లేకుండా తిరిగే వాళ్ళు.



ఆ వూరి రాజ గారికి ఓ అందమైన కూతురు వుంది.ఆమె పేరు జాస్మిన్





రాజ గారు తన కూతురిని ఓ మంచి రాజ కుమారుడికి ఇచ్చి పెళ్ళి చెయ్యాలని రాజ కుమారుల కోసం వెతకటం మొదలు పెట్టాడు

# బొమ్మల కథ



కాని రాజ కుమారికి పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదు.అందుకని అంతఃపురం నుంచి పారిపోయి మార్కెట్లో తిరగ సాగింది

అక్కడ ఆమె అల్లాఉద్దీనను చూసింది. కాని అతన్ని సైనికులు బంధించి మాంత్రికుడి దగ్గరకు తీసుకువెళ్ళటం గమనించింది.





మాంత్రికుడు రాజగారికి స్నేహితుడు

మాంత్రికుడు అల్లావుద్దీన్ ను ఒక పెద్ద గుహ దగ్గర కు తీసుకు వేళతాడు






ఇంకా ఉంది..

# తేడాలు




## తప్పులు కనిపెట్టండి ..



# కనుక్కోండిచూద్దాం



తుమ్మెద పువ్వును చేరుకోటానికి సాయం చెయ్యండి



# రంగులు వేయండి





